జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం




రంగారెడ్డి ఆదివారం13 ఏప్రిల్ 2025 సంపుటి : 15 సంచిక : 218 వెల : రూ.5 పేజీలు : 8 RNI NO. APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail.prajajyothidaily@gmail.com



## అమెరికా-చైనా దేశాల మధ్య సుంకాల యుద్ధం

- బంగారం ధరలకు భారీగా రెక్కలు
- ఐదు శాతానికి పడిపోయిన బంగారం కొనుగోళ్లు

02



## వేంకన్నను కూడా మోసం చేశారా?

- వైకాపా ఎమ్మెల్యే ఆకేపాటి వ్యవహారంపై చంద్రబాబు విస్మయం
- చర్యలకు ఆదేశం

02




# శ్రీశైలం, సాగర్‌లలోని 15 ఔట్‌లెట్లను అప్పగించాలి

**ప్రాజెక్టుల అప్పగింతపై తెలంగాణ పిటిషన్‌ను కొట్టేయాలి**
**సుప్రీంకోర్టులో కృష్ణా బోర్డు కౌంటర్**

**హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం మేరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో 15 ఔట్‌లెట్లను తెలంగాణ, ఏపీలు వెంటనే తమకు అప్పగించాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ) కోరింది. ప్రాజెక్టుల అప్పగింతను వ్యతిరేకిస్తూ తెలంగాణ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను కొట్టేయాలని విజ్ఞప్తి చేసింది. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించాలని కోరుతూ కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, ప్రాజెక్టులవారీగా నీటి కేటాయింపులు చేయకుండా అప్పగించడం సరికాదని పేర్కొంటూ తెలంగాణ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. ఇందులో ప్రతివాదిగా కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ, కేఆర్ఎంబీలను పేర్కొంది. ఈ రెండింటి తరపున బోర్డు.. సుప్రీంకోర్టులో శుక్రవారం కౌంటర్ దాఖలు చేసింది.

మిగతా 2 లో


11

# అభిషేక్ అల్లాడించాడు

**ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక స్కోరు (141)**
**సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుత విజయం**
**ఇది రెండో సక్సెస్‌ఫుల్ రన్ ఛేజ్**

ఐపీఎల్ 2025లో వరుస ఓటములతో డీలాపడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎట్టకేలకు గెలుపు బాట పట్టింది. అభిషేక్ శర్మ సిక్స్‌లతో చెలరేగడంతో పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన 246 పరుగుల భారీ టార్గెట్‌ను రెండే వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. కొండంత లక్ష్యాన్ని సన్‌రైజర్స్ 18.3 ఓవర్లలోనే కరిగించింది. అభిషేక్ శర్మ (141, 55 బంతుల్లో 14 ఫోర్లు, 10 సిక్స్‌లు) పంజాబ్ బౌలర్లపై పంజా విసిరాడు.



# ఏపీలో ఇంటర్ ఫలితాలు విడుదల

- ప్రథమంలో 70.. ద్వితీయలో 83శాతం ఉత్తీర్ణత
- ఫస్టియర్‌లో 85శాతం..సెకండియర్‌లో 93శాతంతో కృష్ణ ఫస్ట్
- 71శాతం ఫలితాలతో బాలికదే పై చేయి
- సోషల్ మీడియా వేదికగా మంత్రి లోకేశ్ ఫలితాలు విడుదల

02


02

## వనజీవి రామయ్య కన్నుమూత

- మొక్కలు నాటే యజ్ఞంలో ముగిసిన ఓ గొప్ప శకం
- ధరిత్రి ముద్దుబిడ్డను కోల్పోయామని ప్రముఖుల నివాళి


10

## ఉత్సాహభరితంగా హనుమాన్ శోభాయాత్ర

- హనుమత్ జయంతి సందర్భంగా ర్యాలీ.. గౌలిగూడ నుంచి తాడ్బంద్ వరకు యాత్ర
- ప్రత్యక్షంగా పర్యవేక్షించిన సిపి సివి ఆనంద్.. ఆంజనేయుడిని దర్శించుకున్న నటి ప్రీతిజింటా

## శివాజీ చరిత్ర ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

- మాతృభూమికి సేవ చేసేందుకు శివాజీ స్ఫూర్తి రావాలి
- కేంద్రహోంమంత్రి అమిత్ షా


02



వైభవంగా ముగిసిన శ్రీవారి వసంతోత్సవాలు

02

# శ్రీశైలం, సాగర్‌లలోని 15 ఔట్‌లెట్లను అప్పగించాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇందులోని ముఖ్యాంశాలిలా ఉన్నాయి. "ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014 ప్రకారం కృష్ణా బోర్డు ఏర్పాటైంది. అంతర్రాష్ట్ర జల వివాద చట్టం–1956 ప్రకారం ఏర్పాటైన ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పు మేరకు ప్రాజెక్టుల్లో నీటి వినియోగం జరిగేలా చూడటం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో ఇతర రాష్ట్రం లేదా కేంద్రపాలిత ప్రాంతానికి ఏదైనా ఒప్పందం కుదిరి ఉంటే అమలు జరిగేలా చూడటం, విద్యుదుత్పత్తి ఉంటే ఒప్పందం ప్రకారం పంపిణీ, కేంద్రం జారీ చేసిన నోటిఫికేషన్‌లో పేర్కొన్న ప్రాజెక్టుల నిర్మాణం జరిగేలా చూడటం, కొత్త ప్రాజెక్టులకు ప్రతిపాదనలు వస్తే పరిశీలించడం మొదలైనవి బోర్డు పని. కృష్ణా నదిపై రెండు రాష్ట్రాల్లో ఉన్న ప్రాజెక్టులు, ఇతర నెట్‌వర్క్ బోర్డు పరిధిలో ఉంటాయి. ఏదైనా ప్రాజెక్టు బోర్డు పరిధిలో ఉండటం గురించి ప్రశ్న తలెత్తితే కేంద్ర ప్రభుత్వానికి పంపి నిర్ణయాన్ని కోరతాం.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు బచావత్ ట్రైబ్యునల్ 811 టీఎంసీలు కేటాయించింది. నీటి రక్షణ ప్రాజెక్టుల వారీగా ఉన్నా కేటాయింపు మాత్రం మొత్తం రాష్ట్రానికి సంబంధించినది. బోర్డు పరిధిని నిర్ణయిస్తూ 2021 జులై 15న కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో ప్రాజెక్టులు, కెనాల్ నెట్‌వర్క్‌ను మూడు వర్గాలుగా విభజించింది. గెజిట్ నోటిఫికేషన్‌లో ఉండి అనుమతుల్లేని ప్రాజెక్టులకు ఆరు నెలల్లోగా అనుమతులు పొందాలని మొదట పేర్కొని, తర్వాత ఏడాదికి పెంచింది. గెజిట్ నోటిఫికేషన్‌ను అమలు చేయడానికి వీలుగా 2021 సెప్టెంబరు 15న సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ బోర్డు నిర్ణయం తీసుకొంది. ఇందులో బోర్డు, రెండు రాష్ట్రాల అధికారులు సభ్యులుగా ఉన్నారు. సబ్ కమిటీ ఇచ్చిన నివేదికపై 2021 అక్టోబరు 12న బోర్డు సమావేశంలో చర్చ జరిగింది. శ్రీశైలంలోని ఏడు, నాగార్జునసాగర్‌లోని ఎనిమిది ఔట్‌లెట్లను మొదట తీసుకోవాలని సబ్ కమిటీ మధ్యంతర నివేదికలో సిఫార్సు చేసింది. దీని ప్రకారం శ్రీశైలంలో రెండు, నాగార్జునసాగర్‌లో ఏడు కాంపోనెంట్‌లను తెలంగాణ... శ్రీశైలంలో ఐదు, సాగర్‌లో ఒకటి ఆంధ్రప్రదేశ్ అప్పగించాల్సి ఉంది. అయితే ఇప్పటివరకూ కేంద్రం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం ప్రాజెక్టులను రెండు రాష్ట్రాలు అప్పగించలేదు. ఆంధ్రప్రదేశ్ అప్పగించడానికి ఉత్తర్వు జారీ చేసినా... తెలంగాణ అప్పగిస్తేనే తామూ ఇస్తామని పేర్కొంది. 2023 అక్టోబరు 6న కేంద్రం కృష్ణా ట్రైబ్యునల్–2కు సవరించిన టీఓఆర్ జారీ చేసింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీల్లో ఎవరి వాటా ఎంత అన్నది తేల్చడానికి అంతర్రాష్ట్ర జలవివాద చట్టంలోని సెక్షన్ 3 ప్రకారం విచారించాలని అందులో పేర్కొంది. ప్రస్తుతం ఈ అంశం ట్రైబ్యునల్ ఎదుట ఉంది. ఇదే సమయంలో కృష్ణా జలాల పంపిణీ, ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించడంపై తెలంగాణ అసెంబ్లీ చేసిన తీర్మానాన్ని 2024 ఫిబ్రవరి 24 నీటిపారుదల శాఖ కార్యదర్శి బోర్డుకు పంపారు. ఇందులో రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ, బేసిన్‌లోని అవసరాలకు నీటి కేటాయింపు, శ్రీశైలం నుంచి పక్క బేసిన్‌కు మళ్లించే నీటిని 34 టీఎంసీలకే పరిమితం చేయడం తదితరాలు జరగకుండా బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించడం కుదరదని పేర్కొన్నారు. ఈ అంశాలపై కృష్ణా ట్రైబ్యునల్–2 వాదనలు వింటోంది. రెండు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం మేరకు శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో 15 ప్రాధాన్య ఔట్‌లెట్లను బోర్డుకు అప్పగించాలి. తెలంగాణ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను కొట్టేయాలి" అని కౌంటర్‌లో కృష్ణా నదీ యాజమాన్య బోర్డు పేర్కొంది.

### 29 కాంపోనెంట్‌ల అప్పగింతకే తెలంగాణ, ఏపీ సుముఖం

"గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం 12 ప్రాజెక్టులకు చెందిన 65 కాంపోనెంట్‌లను రెండు రాష్ట్రాలు బోర్డుకు అప్పగించాల్సి ఉంది. అయితే వాటిలో 49 కాంపోనెంట్లు మాత్రమే ఆపరేషన్‌లో ఉండగా.. తెలంగాణ అధీనంలో 22, ఆంధ్రప్రదేశ్ అధీనంలో 20, రెండు రాష్ట్రాల ఉమ్మడి పర్యవేక్షణలో ఏడు ఉన్నాయి. పాక్షికంగా నిర్వహణలో ఉన్నవాటిని కూడా ఆపరేషన్‌లో ఉన్నట్లుగానే నిర్ణయించాం. రెండు రాష్ట్రాలు ఈ 49 కాంపోనెంట్‌లను 2021 అక్టోబరు 14న బోర్డుకు అప్పగించాల్సి ఉంది. అయితే కొన్నింటి విషయంలో రెండు రాష్ట్రాలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. 29 కాంపోనెంట్‌లను వెంటనే బోర్డు పరిధిలోకి తేవడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇందులో 12 పూర్తిగా తెలంగాణ, 10 పూర్తిగా ఆంధ్రప్రదేశ్, 7 రెండు రాష్ట్రాల నిర్వహణలో ఉన్నాయి. మొదటి దశలో వీటిని తమ పరిధిలోకి తీసుకోవాలని... మిగిలినవాటినీ దశలవారీగా తీసుకోవాలని బోర్డు అభిప్రాయపడింది"

## వైభవంగా ముగిసిన శ్రీవారి వసంతోత్సవాలు

**తిరుమల :** తిరుమలలోని శనివారం సాలకట్ల వసంతోత్సవాలు వైభవంగా ముగిశాయి. చివరిరోజు వసంతోత్సవ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామితోపాటు శ్రీసీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, శ్రీరుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామివార్లకు వసంతోత్సవ సేవ నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం చేశారు. ప్రతినెలా పౌర్ణమినాడు తిరుమలలో నిర్వహించే గరుడ సేవను వార్షిక వసంతోత్సవాల కారణంగా తితిదే రద్దు చేసింది. కార్యక్రమంలో జీయంగార్లు, తితిదే బోర్డు సభ్యురాలు సుచిత్ర ఎల్ల, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.











# ఏపీలో ఇంటర్ ఫలితాలు విడుదల

- ప్రథమంలో 70.. ద్వితీయలో 83శాతం ఉత్తీర్ణత
- ఫస్టియర్‌లో 85శాతం..సెకండియర్‌లో 93శాతంతో కృష్ణ ఫస్ట్
- 71శాతం ఫలితాలతో బాలికదే పై చేయి
- సోషల్ మీడియా వేదికగా మంత్రి లోకేశ్ ఫలితాలు విడుదల



**అమరావతి, ఏప్రిల్ 12 :** ఏపీ ఇంటర్ ఫలితాలను మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 70 శాతం ఉత్తీర్ణత సాధించగా.. రెండో ఏడాదిలో 83 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ సందర్భంగా నారా లోకేశ్ మాట్లాడుతూ.. గత పదేళ్లలో అత్యధిక ఉత్తీర్ణత శాతం ఈ ఏడాది నమోదైందని పేర్కొన్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీల్లో మంచి ఫలితాలు వచ్చాయన్నారు. ఇంటర్‌లో మంచి ఫలితాలు వచ్చేందుకు అధ్యాపకులు, సిబ్బంది కృషి చేశారని కొనియాడారు. ఇంటర్ తొలి ఏడాది ఫలితాల్లో 85 శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లాకు అగ్రస్థానం దక్కింది. రెండో ఏడాది ఫలితాల్లో 93 శాతం ఉత్తీర్ణతతో కృష్ణా జిల్లాకు ప్రథమ స్థానం లభించింది. తొలి ఏడాది ఫలితాల్లో 54 శాతం ఉత్తీర్ణతతో చిత్తూరు జిల్లాకు చివరి స్థానం వచ్చింది. రెండో ఏడాది ఫలితాల్లో 73 శాతం ఉత్తీర్ణతతో అల్లూరి జిల్లా ఆఖరి స్థానంలో నిలిచింది. ఇంటర్ ఫస్ట్, సెకండియర్ ఫలితాలను ఒకేసారి రిలీజ్ అయ్యాయి. ఈ పరీక్షల్లో పదేళ్లలో కంటే అత్యధిక శాతం ఉత్తీర్ణత నమోదు అయ్యింది. శనివారం ఉదయం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మంత్రి నారా లోకేష్ ఏపీ ఇంటర్ ఫలితాలను విడుదల చేశారు. ఈసారి అత్యధికంగా పాస్ పర్సంటేజ్ నమోదు అవడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 70 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా.. రెండో సంవత్సరంలో 83 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత పొందారు. ప్రతీఏడు లాగే ఈ ఏడాది కూడా ఇంటర్ ఫలితాల్లో బాలికదే పై చేయిగా నిలిచింది. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో బాలికలు 71 శాతం ఉత్తీర్ణత సాధించగా.. బాలురు 64 శాతం ఉత్తీర్ణత పొందారు. అలాగే ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 81 శాతంతో బాలికలు ఉత్తీర్ణత పొందగా.. బాలురు 75 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇదిలా ఉండగా.. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఇంటర్మీడియట్ బోర్డు కీలక సమాచారం ఇచ్చింది. ఈ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై ఇంటర్ బోర్డు అధికారులు ముఖ్య ప్రకటన చేశారు. మే 12 నుంచి ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ జరుగనుంది. మే 12 నుంచి 20 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు ఏప్రిల్ 15 వరకు సప్లెమెంటరీ పరీక్షల కోసం ఫీజు చెల్లించాల్సిందిగా బోర్డు తెలిపింది. ఏప్రిల్ 22 వరకు చివరి తేదీగా ప్రకటించింది. అలాగే సప్లిమెంటరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరుగనున్నాయి. ఫెయిల్ అయిన విద్యార్థులు ఎలాంటి ఆందోళన పడకుండా.. సప్లిమెంటరీ పరీక్షలు రాసి ఉత్తీర్ణత సాధించాలని అధికారులు కోరుతున్నారు.



# వేంకన్నను కూడా మోసం చేశారా?

- వైకాపా ఎమ్మెల్యే ఆకేపాటి వ్యవహారంపై చంద్రబాబు విస్మయం
- చర్యలకు ఆదేశం

**కడప:** అన్నమయ్య జిల్లా రాజంపేట వైకాపా ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి భూదందాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు విస్మయం వ్యక్తం చేశారు. శ్రీవేంకటేశ్వరస్వామి వారిని సైతం మోసగించారని తెలుసుకుని.. మరీ ఇంత మోసమా అంటూ వ్యాఖ్యానించారు. ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణానికి హాజరైన సీఎం శుక్రవారం రాత్రి అక్కడే బస చేశారు. శనివారం ఉదయం అన్నమయ్య జిల్లా తెదేపా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, పార్టీ నేతలు ఆయన్ను కలిసి అమర్‌నాథ్‌రెడ్డి కబ్జాలపై ఫిర్యాదు చేశారు. 'రాజంపేట మండలం ఆకేపాడులో ప్రైవేటు వ్యక్తులకు చెందిన 5 ఎకరాల భూమిని ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి కబ్జా చేసి, అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ భూమిలో 1.50 ఎకరాలను తితిదే పేరిట రాయించి, దేవస్థానం నిధులతో కల్యాణ మండపం నిర్మించారు. నిర్మాణ అనంతరం తితిదే పేరిట రాయించిన భూమితో సహా 5 ఎకరాలను తన భార్య ఆకేపాటి జ్యోతి పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ భూమి మ్యుటేషన్ కోసం తితిదే ప్రయత్నించగా రెవెన్యూ అధికారులు తిరస్కరించారు. ఆర్ఎస్ఆర్, ఆర్‌హెచ్ రికార్డుల ప్రకారం ఆ భూములు ఆకేపాడుకు చెందిన చమర్తి పిచ్చిరాజు, పద్మరాజు చిన్నంరాజుల పేరిట 1915 నుంచి ఉన్నాయని వివరణ ఇచ్చారు' అని తెదేపా నేత సుబ్బ నరసయ్యనాయుడు ముఖ్యమంత్రికి తెలిపారు. దీనిపై తితిదే చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఆకేపాటి భూదందాలు వెలికి తీయడంతో తనకు ప్రాణభయం ఉందని.. పోలీసు శాఖ నుంచి రక్షణ కల్పించాలని నరసయ్యనాయుడు సీఎంను కోరారు.

**సీతారాముల కల్యాణోత్సవం ఏర్పాట్లపై సంతృప్తి**

ఒంటిమిట్ట సీతారాముల కల్యాణోత్సవం ఏర్పాట్లపై సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు. చక్కగా పని చేశారంటూ తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, వైఎస్సార్ జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌లకు కితాబిచ్చారు. అధికారుల సమష్టి కృషికి ఇదో నిదర్శనమంటూ వ్యాఖ్యానించారు.

# ఇసుక దోపిడీ కోసం గుండ్లకమ్మ గేట్లు ధ్వంసం

## వైకాపా నేతలపై మంత్రి గొట్టిపాటి సంచలన ఆరోపణలు

**బాపట్ల, ఏప్రిల్ 12 :** ఇసుక దోపిడీ కోసమే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో గుండ్లకమ్మ గేట్లను విరగొట్టారని అంటూఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టి పాటి రవికుమార్ సంచలన ఆరోణలు చేశారు.. అధికారంలో ఉండగా వైకాపా నేతలు అనేక అరచకాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజ కవర్గంలో పర్యటించిన ఆయన.. బల్లికురవలో ఈర్ల గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాగునీటి సంఘాల కమిటీ– సభ్యులతో మాట్లాడి దిశా నిర్దేశర చేవారు.. ఎండాకాలం పూర్తి అయ్యేలోపు కాలువ పూడికతీత, మరమత్తులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇక, ఈ సందర్భంగా మంత్రి గొట్టి పాటి మాట్లా డుతూ.. వ్యవసాయం సీజన్ నాటికి పంట కాలువలు రైతులకు అందు బాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.. గుండ్లకమ్మ చుట్టు– పక్కల గ్రామాల ప్రజలతో పాటు రైతాంగాన్ని కాపాడుకుంటాం అన్నారు.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇసుక దోపిడీ కోసమే గుండ్లకమ్మ ప్రాజెక్ట్ గేట్లను విరగొట్టారని ఆరోపించారు.. గుండ్లకమ్మ నుంచి వైసీపీ నేతలు కోట్లాది రూపాయిల ఇసుక దోపిడీ చేశారని విమ ర్శించారు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరమత్తుల కోసం నిధులు కేటాయించింది. గుండ్లకమ్మ ప్రాజెక్టులో 3 టీ–ఎంసీల నీటిని నిల్వ చేసి 20 లక్షల చేపపిల్లలను వదిలామని వెల్లడించారు.. జలాశయం మీద ఆధారపడి జీవించే వారికి జీవనోపాధి కలిస్తున్నాం అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు.




# చరిత్రలో తొలిసారి..

## గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులు చట్టాలుగా..



**చెన్నై:** పెండింగ్ బిల్లుల విషయంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చిన వేళ.. తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగ చరిత్రలో తొలిసారి రాష్ట్రపతి, గవర్నర్ ఆమోదం లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం 10 చట్టాలను నోటిఫై చేసింది. ఈమేరకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చింది. శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆర్‌ఎన్ రవికి పంపగా ఆయన ఎలాంటి సమాధానం ఇవ్వకుండా వాటిని తనవద్దే ఉంచేసుకుంటున్నారని తమిళనాడు ప్రభుత్వం ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై 2023లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. బిల్లుల్ని సమ్మతించకపోవడం, పునఃపరిశీలించాలని సూచిస్తూ వెనక్కి కూడా పంపడం లేదని తెలిపింది. రెండోసారి ఆమోదించిన బిల్లుల విషయంలోను ఆయన తీరు మార లేదంటూ పిటిషన్‌లో పేర్కొంది. ఈ వ్యవహారంపై ఇటీవల సుప్రీం తీర్పు వెలువరించింది. తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవికుమార్ తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఏదైనా బిల్లును మంత్రిమండలి సలహా మేరకు రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సివస్తే అందుకు గవర్నర్ తీసుకోదగిన అత్యధిక గడువు ఒక నెల మాత్రమేనని సంచలనాత్మక తీర్పు వెలువరించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ నిర్దిష్ట గడువులోగా చర్యలు తీసుకోవాలని మంగళవారం పేర్కొంది. "గవర్నర్ 10 బిల్లులను రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వు చేసి పెట్టడం న్యాయ సమ్మతం కాని ఏకపక్ష చర్య. అందుకే ఆ చర్యను తోసిపుచ్చుతున్నాం" అని జస్టిస్ జె.బి.పర్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. పెండింగులో పెట్టిన పది బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టే భావించాలని స్పష్టంచేసింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ చర్యలు తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేయడం ఇదే ప్రథమం. ఒకవేళ మంత్రిమండలి సలహా లేకుండా గవర్నర్ బిల్లు ఆమోదాన్ని నిలిపి ఉంచాలని భావించిన పక్షంలో మూడు నెలల్లోగా అలాంటి బిల్లును శాసనసభకు తిరిగి పంపాలని సూచించింది. గవర్నర్ ఈ కాల నిర్దేశాన్ని పాటించనిపక్షంలో ఆయన చర్యపై కోర్టులు న్యాయసమీక్ష జరపవచ్చని వెల్లడించింది. మంత్రి మండలి సలహా మేరకు తప్పనిసరిగా పనిచేయడం తప్ప గవర్నర్‌కు విచక్షణాధికారాలేవీ లేవని, రాజ్యాంగంలోని 200వ అధికరణం కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేస్తోందని తెలిపింది. రెండోసారి సమర్పించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వు చేసి ఉంచే అధికారం గవర్నర్‌కు లేదంది. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు చరిత్రాత్మకమని తమిళనాడు సీఎం స్టాలిన్ అభివర్ణించిన సంగతి తెలిసిందే.



# బెంగాల్‌లో మళ్లీ చెలరేగిన హింస..

## 110 మంది అరెస్ట్


**పశ్చిమ బెంగాల్ :** వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్‌లో శుక్రవారం నుంచి నిరసనలు కొనసాగుతున్నాయి. శనివారం మాల్డా, ముర్షిదాబాద్, సౌత్ 24 పరగణాలు, హుగ్లీ జిల్లాల్లో నిరసనకారులు పెద్దఎత్తున ఆందోళనకు దిగి.. రోడ్లను దిగ్బంధించారు. వారిని ఆపడానికి ప్రయత్నించిన భద్రతా సిబ్బందిపై వారు రాళ్లతో దాడులు చేయగా హింసాత్మక పరిస్థితి నెలకొంది. దీంతో 110 మందికి పైగా నిరసనకారులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ప్రస్తుతం పరిస్థితి ఉద్రిక్తంగానే ఉందన్నారు. హింసాత్మక చర్యలు నెలకొంటున్న నేపథ్యంలో ముర్షిదాబాద్ జిల్లాలో పలు నిషేధాజ్ఞలు విధించామని.. ఇంటర్నెట్ సేవలు నిలిపివేశామని అధికారులు తెలిపారు. శాంతిభద్రతలను పునరుద్ధరించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. సోషల్ మీడియాలో వ్యాప్తి చేస్తున్న వదంతులను పట్టించుకోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఘర్షణ సమయంలో ఆందోళనకారులపై జరిపిన కాల్పుల్లో గాయపడిన 10మంది పోలీసులు.. ఓ యువకుడిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. వక్ఫ్ చట్టం మంగళవారం నుంచి అమల్లోకి వచ్చింది. ఈ మేరకు కేంద్ర మైనారిటీ వ్యవహారాలశాఖ ఒక నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అయితే పశ్చిమ బెంగాల్‌లో వక్ఫ్ సవరణ చట్టాన్ని అమలుచేయబోమని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఇటీవల ప్రకటించారు. మైనారిటీలు, వారి ఆస్తులను రక్షిస్తానని హామీ ఇచ్చారు. ఒకప్పుడు బంగ్లాదేశ్, పాకిస్థాన్, భారతదేశం కలిసి ఉండేవని.. తర్వాతే విభజన జరిగిందని గుర్తుచేశారు. ఇక్కడే ఉండిపోయిన మైనారిటీలకు రక్షణ కల్పించడం మన బాధ్యత అని.. తాను ఉన్నంతకాలం వారిని, వారి ఆస్తులను రక్షిస్తానని అన్నారు.

### పరిస్థితిని అదుపుచేయడంలో మమత ప్రభుత్వం విఫలం : భాజపా

పరిస్థితిని అదుపు చేయడంలో మమత ప్రభుత్వం విఫలమయ్యిందని భాజపా విమర్శలు గుప్పించింది. దీనిని అదుపులోకి తీసుకురావడానికి అవసరమయితే కేంద్రం సహాయం తీసుకోవాలని సూచించింది. ఇది నిరసన చర్యగా కనిపించట్లేదని.. సమాజంలోని ఇతర వర్గాలలో గందరగోళాన్ని వ్యాప్తి చేయడానికి దుష్టశక్తులు చేస్తున్న ప్రయత్నాలని మండిపడింది.

# దేశంలో ఉగ్రదాడులు జరగొచ్చు..

## నిఘా సంస్థల హెచ్చరిక



**న్యూఢిల్లీ :** దేశంలో ఉగ్రదాడులు జరగవచ్చని నిఘా సంస్థలు హెచ్చరికలు చేశాయి. పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడులకు దిగొచ్చని హెచ్చరించాయి. ఈ క్రమంలో రైల్వేశాఖను అప్రమత్తం చేశాయి. డ్రోన్, ఐఈడీతో దాడులు జరగవచ్చని వెల్లడించాయి. నదీమార్గాల్లో తీవ్రవాదులు చొరబడవచ్చని చెప్పాయి. ముంబయి ఉగ్రదాడి కీలక కుట్రదారు తహవ్వుర్ రాణాను అమెరికా నుంచి భారత్‌కు తీసుకువచ్చి విచారిస్తోన్న తరుణంలో ఈ అలర్ట్ రావడం గమనార్హం. 2008 నవంబర్ 26న 10మంది పాకిస్థానీ ఉగ్రవాదులు సముద్రమార్గం ద్వారా ముంబయికి చేరుకొని.. సీఎస్ఎంటీ, ఒబెరాయ్ ట్రైడెంట్, తాజ్ హోటల్ తదితర ప్రాంతాల్లో దాడులకు పాల్పడ్డారు. నవంబర్ 29 వరకు మారణహోమం కొనసాగింది. ఈ ఘటనల్లో 18 మంది భద్రతా సిబ్బంది సహా 166 మంది ప్రాణాలు కోల్పోగా, అనేకమంది గాయపడ్డారు. అప్పటి యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) చీఫ్ హేమంత్ కర్కరే, ఆర్మీ మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్, ముంబయి అదనపు పోలీస్ కమిషనర్ అశోక్ కామ్టే, సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ విజయ్ సలాస్కర్‌లు అమరులయ్యారు. రాణా పాకిస్థాన్‌కు చెందిన కెనడా జాతీయుడు. 26/11 ముంబయి దాడుల్లో కీలక సూత్రధారి.


# అమెరికాలో భారత సంతతి

# రాజకీయ నాయకుడిపై గ్యాంబ్లింగ్ కేసు



**న్యూయార్క్:** భారత సంతతికి చెందిన రాజకీయ నాయకుడిపై అమెరికాలో గ్యాంబ్లింగ్ కేసు నమోదైనట్లు న్యూజెర్సీ అటార్నీ జనరల్ మాథ్యూ ప్లాట్కిన్ పేర్కొన్నారు. గ్యాంబ్లింగ్ సహా పలు అక్రమ కార్యకలాపాల్లో భారత సంతతికి చెందిన మున్సిపల్ కౌన్సిలర్ ఆనంద్ షా ప్రమేయం ఉందని.. గ్యాంబ్లింగ్, మనీ లాండరింగ్ ఇతర నేరాలకు పాల్పడిన 39మంది వ్యక్తుల్లో ఆనంద్ ఒకరని వెల్లడించారు. రాష్ట్రంలోని 12 ప్రదేశాల్లో దాడులు చేసి ఈ అభియోగాలు మోపినట్లు తెలిపారు. న్యూ యార్క్ శివారు ప్రాంతమైన ప్రాస్పెక్ట్ పార్క్‌లో మున్సిపల్ కౌన్సిలర్‌గా ఒకసారి విధులు నిర్వర్తించిన షా రెండోసారి పదవిలో కొనసాగుతున్నారు. ఆర్థిక అభివృద్ధి, బీమా బాధ్యత లను కూడా నిర్వహించారు. ఫ్లోరిడాలోని లాంగ్‌వుడ్‌లో నివసి స్తున్న భారత సంతతికి చెందిన మరో వ్యక్తి సమీర్ ఎస్.నాదకర్ణి స్పోర్ట్స్‌బుక్ సబ్ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్నందు వల్ల అతడిపై అభియోగాలు నమోదైనట్లు తెలిపారు. ప్లాట్కిన్ కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం.. అమెరికాలోని అతి ప్రమాదకరమైన మాఫియా గ్రూప్‌లలో ఒకటైన "లూచీస్ క్రైమ్ ఫ్యామిలీ" అనే సంస్థతో కలిసి ఆనంద్ చట్టవిరుద్ధంగా పోకర్ గేమ్‌లను, ఆన్‌లైన్ స్పోర్ట్స్‌బుక్‌ను (గ్యాంబ్లింగ్) నిర్వహి స్తున్నట్లు అధికారు లు గుర్తించారు. ఆన్‌లైన్ స్పోర్ట్స్‌బుక్‌లో వివిధ క్రీడలకు సంబంధించిన టోర్నమెంట్‌లపై బెట్టింగ్‌కు పాల్పడుతుంటారు. ఇందులో దాదాపు 3 మిలియన్ డాలర్ల వరకు బెట్టింగ్‌లు ఉంటాయి. చట్టబద్ధంగా నిర్వహిస్తున్న పలు రెస్టరంట్లు, సామాజిక క్లబ్‌ల ముసుగులో ఈ అసాంఘిక కార్యకలాపాలు నడుస్తున్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రజల తరఫున ఎన్నికై.. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న నాయకులు ఇలా ప్రవర్తించడం వల్ల ప్రజల్లో నాయకులపై ఉన్న నమ్మకం పోతుందని మాథ్యూ ప్లాట్కిన్ అసహనం వ్యక్తంచేశారు.

# పపువా న్యూగినియాలో భూకంపం



**పపువా న్యూగినియా :** పపువా న్యూ గినియాలో భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.2గా నమోదైంది. శనివారం కోకోపో పట్టణానికి 115 కి.మీ. దూరంలో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే పేర్కొంది. దాదాపు ఒక నిమిషం పాటు భూమి కంపించిందని స్థానికంగా ఉన్న ఒక రిసార్ట్ నిర్వాహకుడు తెలిపారు. అయితే, తాజా భూకంపం వల్ల ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని తెలుస్తోంది. పపువా న్యూ గినియాలో భూకంపాలు సర్వసాధారణమే. అయినప్పటికీ ఈ ప్రకృతి విపత్తు కారణంగా కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇక, ఇటీవల మయన్మార్, థాయ్‌లాండ్‌లలో 7.7 తీవ్రతతో భారీ భూకంపం వచ్చిన సంగతి తెలిసిందే. దీని కారణంగా ఒక్క మయన్మార్‌లోనే మూడువేల మందికిపైగా చనిపోయారు. వేల సంఖ్యలో గాయపడగా పలువురు గల్లంతయ్యారు.

# న్యూక్లియర్ డీల్‌పై పరోక్ష చర్చల దిశగా ఇరాన్

## యూఎస్ అడుగులు



**యూఎస్ :** అణు ఒప్పందంపై ఇరాన్‌తో చర్చలకు తాను సిద్ధంగా ఉన్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే పలుమార్లు పేర్కొన్నారు. ఈమేరకు ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీకి ట్రంప్ లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో న్యూక్లియర్ డీల్‌పై పరోక్ష చర్చల దిశగా ఇరాన్, యూఎస్ అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ తన అణు కార్యక్రమంపై అమెరికాతో న్యాయమైన ఒప్పందం చేసుకోవడానికి ఎదురుచూస్తోందని.. ఖమేనీ సన్నిహితుడు అలీ షమానీ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. కెమెరాల ముందు మాట్లాడుతూ, అందరికీ ప్రదర్శనలు ఇవ్వడానికి బదులు టెహ్రాన్ నిజమైన, న్యాయమైన ఒప్పందాన్ని కోరుతోందని ఆయన అన్నారు. ఇందుకు ముఖ్యమైన ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అమెరికాతో పరోక్ష చర్చల కోసం మధ్యవర్తిగా వ్యవహరిస్తున్న ఇరాన్ తమ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చిని ఒమన్‌కు పంపుతున్నట్లు షమానీ వెల్లడించారు. ఈ విషయంలో వాషింగ్టన్ అసంబద్ధమైన డిమాండ్లను, సమస్యలు లేవనెత్తకుండా అనుకూలంగా వ్యవహరిస్తే.. అగ్రరాజ్యంతో కొత్త అణుఒప్పందాన్ని కుదుర్చుకునే అవకాశం ఉందన్నారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. టెహ్రాన్ అణు కార్యక్రమంపై ఒప్పందం కుదుర్చుకునే లక్ష్యంతో ఇరాన్, అమెరికా శనివారం ఒమన్‌లో దౌత్యపరమైన చర్చలు జరపనున్నాయి. ఈ చర్చలకు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరఘ్చి, అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ నాయకత్వం వహించనున్నారు. ఈనేపథ్యంలో అలీ షమానీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అణు ఒప్పందం విషయంలో ఇరాన్ తమతో ప్రత్యక్ష చర్చలకు రావాలని అమెరికా కోరుతుండగా.. పరోక్ష చర్చలైతేనే తాము ముందుకువస్తామని ఖమేనీ స్పష్టంచేశారు. అయితే ఈ చర్చలు విఫలమైతే ఇరాన్‌పై సైనిక చర్యలు తీసుకోవాల్సి వస్తోందని ట్రంప్ హెచ్చరించారు. ఇక, ఇరాన్‌తో గతంలో అణు ఒప్పందం చేసుకున్న అమెరికా.. 2018లో ట్రంప్ హయాంలోనే దానినుంచి వైదొలిగిన విషయం తెలిసిందే.

# ఒక్క విమాన ప్రయాణంలో ఎన్ని మలుపులో..





**ఐలాండ్ :** కేమాన్ ఐలాండ్ నుంచి లండన్‌కు వెళ్లడానికి విమానం ఎక్కిన ప్రయాణికులకు వింత అనుభవం ఎదురైంది. దీనివల్ల దాదాపు 23 గంటలు విమానంలోనే ఉన్నారు. అసలేమైందంటే.. బ్రిటిష్ ఎయిర్‌వేస్ విమానం బీఏ252 ఇటీవల కేమాన్ ఐలాండ్ నుంచి లండన్‌కు బయల్దేరింది. కానీ మార్గమధ్యంలో ఓ ప్రయాణికురాలు అనారోగ్యం పాలవడంతో అత్యవసర వైద్య పరిస్థితి కారణంగా విమానాన్ని కెనడాలోని న్యూఫౌండ్‌ల్యాండ్‌లోని గాండర్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మళ్లించారు. అక్కడి నుంచి తిరిగి ప్రారంభమైన కొన్ని గంటల అనంతరం తమ విధుల సమయం ముగిసిపోయిందని పేర్కొంటూ.. రేక్యవిక్ విమానాశ్రయంలో పైలట్లు మరోసారి విమానాన్ని ఆపారు. అనంతరం ఎయిర్‌లైన్స్ అధికారులు ఇతర పైలట్లను ఏర్పాటుచేయడంతో ప్రయాణం తిరిగి మొదలైంది. చివరకు లండన్‌లోని హీత్రో విమానాశ్రయంలో దిగింది. ఏప్రిల్ 8న రాత్రి 10.24 గంటలకు కేమాన్ ఐలాండ్ నుంచి బయల్దేరిన విమానం 19 గంటల తర్వాత లండన్‌కు చేరుకోవడంతో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్గమధ్యంలో వెళ్లిపోయిన పైలట్ల తీరుపై అసహనం వ్యక్తం చేశారు.

# ఢిల్లీలో దుమ్ము తుఫాను..

## విమాన ప్రయాణికులకు 12 గంటలపాటు ఇక్కట్లు



**న్యూఢిల్లీ :** ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో శుక్రవారం పలు విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో అక్కడ ప్రయాణికులు కూడా ఇబ్బందులు పడ్డారు. పలువురు విమాన ప్రయాణికులు ఎక్స్ వేదికగా తమ ఆవేదనను వ్యక్తంచేశారు. దేశ రాజధానిలోని కొన్ని ప్రాంతాల్లో దుమ్ము తుఫానుతో పాటు మోస్తారు వర్షం కురిసింది. శుక్రవారం సాయంత్రం బలమైన ఈదురుగాలులు వీచాయి. దీని కారణంగా కొన్నిచోట్ల చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. ఈక్రమంలోనే బలమైన ఈదురుగాలులు వీయడంతో దాదాపు 15 విమానాలను దారి మళ్లించినట్లు విమానాశ్రయ అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎయిరిండియా, ఇండిగో విమానయాన సంస్థలు తమ ప్రయాణికులకు అడ్వైజరీ జారీ చేశాయి. విమానాల రాకపోకల ఆలస్యం కారణంగా ఎయిర్‌పోర్టులోని ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాదాపు 12 గంటలుగా విమానాశ్రయంలోనే వేచి చూసినట్లు ఒక మహిళ పేర్కొన్నారు. 'ముంబయికి వెళ్లేందుకు ఢిల్లీ విమానాశ్రయానికి వచ్చాం. ఉదయం 12 గంటలకు బుక్ చేసుకున్న విమానం కాకుండా మరొకటి ఎక్కాలని అధికారులు సూచించారు. అదికాస్త ఎక్కాక అందులోనే 4 గంటల పాటు కూర్చోబెట్టి తర్వాత దింపేశారు' అని ఒక ప్రయాణికుడు వార్తా సంస్థతో తెలిపారు. ఇక, పలువురు ప్రయాణికులు ఎక్స్ వేదికగా ఆవేదనను వ్యక్తంచేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం అయి ఉండి సరైన సమాచారం ఇవ్వకపోవడంపై ఒక ప్రయాణికుడు ఆగ్రహం వ్యక్తంచేశారు.



# చంద్రుడిపై మానవ వ్యర్థాలు..

## మంచి ఐడియా ఇస్తే రూ.25 కోట్ల ప్రైజ్ మనీ: నాసా ఆఫర్

**నాసా :** చంద్రుడిపై దాగిఉన్న పలు విషయాలను తెలుసుకునేందుకు చాలా దేశాలు ఏళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాయి. దాదాపు 50 సంవత్సరాలుగా అమెరికా అంతరిక్ష సంస్థ నాసా జాబిల్లిపై తమ వ్యోమగాములను పంపుతోంది. దీంతో అక్కడ మానవ వ్యర్థాలు కుప్పగా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలోనే నాసా ఓ ఆఫర్‌ను ప్రకటించింది. వాటిని తొలగించేలా లేదా రీసైక్లింగ్ చేసేలా వినూత్న పరిష్కారం చెబితే 3 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.25 కోట్లు) నజరానా అందిస్తామని తెలిపింది. నాసా 1969 నుంచి 1972 మధ్యకాలంలో అపోలో మిషన్ ద్వారా వ్యోమగాములను చంద్రుడిపై పరిశోధనల కోసం పంపించింది. ఆరుసార్లు విజయవంతంగా మిషన్ల ల్యాండింగ్స్ జరిగాయి. వ్యోమగాములు పరిశోధన కోసం జాబిల్లి నుంచి కొంత నమూనా తీసుకువచ్చాయి. అయితే.. లూనార్ మాడ్యూల్‌లో నిల్వ ఉంచే స్థల పరిమితిని దృష్టిలో ఉంచుకున్న వ్యోమగాములు అనవసరమైన వస్తువులను బయటకు విసిరేసి వచ్చారని నాసా తాజాగా తెలిపింది. వీటిలో మానవ వ్యర్థాలే అధిక మొత్తంలో ఉన్నట్లు వెల్లడించింది. వీటిని చిన్నచిన్న బ్యాగుల్లో ఉంచి జాబిల్లిపై పడేసి వచ్చారని తెలిపింది. ఇలా మొత్తం 96 సంచుల వ్యర్థాలు చంద్రుడిపై ఉన్నాయి. వాటిని అక్కడినుంచి తొలగించాల్సిన అవసరాన్ని దృష్టిలోపెట్టుకున్న నాసా ఈ ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. లూనార్ సైకిల్ ఛాలెంజ్ పేరిట దీన్ని ప్రారంభించింది. వ్యర్థాలను నీరు, శక్తి, ఎరువుగా మార్చేందుకు ఐడియాలు ఇవ్వాలంటూ ఆహ్వానం పలికింది. ఈ ఛాలెంజ్‌లో గెలిచిన వారికి 3 మిలియన్ డాలర్లు అందజేస్తామని ప్రకటించింది. చంద్రుడిపైనే కాక అంతరిక్షంలోకి వెళ్లే వ్యోమగాములు తాము ఉపయోగించిన వస్తువులను రీసైక్లింగ్ ద్వారా మళ్లీ వినియోగిస్తుంటారు. అక్కడ ఉండే మానవ సంబంధింత వ్యర్థాలను నిర్మూలించాలన్నా, తిరిగి భూమిపైకి తీసుకురావాలన్నా సవాళ్లతో కూడుకున్న అంశం. ఈ కోణంలోనూ ఆలోచించిన నాసా తాజాగా ప్రకటన చేసింది. భవిష్యత్తులో చందమామ పైకి మానవులను తీసుకెళ్లడం.. అక్కడ వారి జీవన విధానాన్ని మెరుగుపరచడంలో ఇప్పుడు ఇచ్చే ఐడియా ఎంతో కీలకమవ్వనున్నట్లు తెలుస్తోంది.

# గవర్నర్ల నుంచి రాష్ట్రపతికి బిల్లుల అంశం

## సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి పరిశీలన కోసం గవర్నర్లు పంపే బిల్లులను ఉద్దేశించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గవర్నర్లు పంపిన బిల్లులపై రాష్ట్రపతి మూడు నెలల్లోగా నిర్ణయం తీసుకోవాలని సూచించింది. గడువు నిర్దేశిస్తూ అత్యున్నత న్యాయస్థానం ఈతరహా తీర్పు చెప్పడం ఇదే తొలిసారి కావడం గమనార్హం. తమిళనాడు శాసనసభ ఆమోదించిన పది బిల్లులను రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్.రవికుమార్ తొక్కిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని ఇటీవల సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఏదైనా బిల్లును మంత్రిమండలి సలహా మేరకు రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచాల్సివస్తే అందుకు గవర్నర్ తీసుకోదగిన అత్యధిక గడువు ఒక నెల మాత్రమేనని సంచలనాత్మక తీర్పు వెలువరించింది. శాసనసభ ఆమోదించిన బిల్లులపై గవర్నర్ చర్యలు తీసుకోవడానికి గడువును నిర్దేశిస్తూ కోర్టు ఆదేశాలు జారీ చేయడం ఇదే ప్రథమం. ఒకవేళ మంత్రి మండలి సలహా లేకుండా గవర్నర్ బిల్లు ఆమోదాన్ని నిలిపి ఉంచాలని భావించిన పక్షంలో మూడు నెలల్లోగా అలాంటి బిల్లును శాసనసభకు తిరిగి పంపాలని సూచించింది. గవర్నర్ ఈ కాల నిర్దేశాన్ని పాటించని పక్షంలో ఆయన చర్యపై కోర్టులు న్యాయసమీక్ష జరపవచ్చని వెల్లడించింది. మంత్రి మండలి సలహా సూచనల మేరకు తప్పనిసరిగా పనిచేయడం తప్ప గవర్నర్‌కు విచక్షణాధికారాలేవీ లేవని, రాజ్యాంగంలోని 200వ అధికరణం కూడా ఇదే విషయాన్ని స్పష్టంచేస్తోందని తెలిపింది. రెండోసారి సమర్పించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం రిజర్వు చేసి ఉంచే అధికారం గవర్నర్‌కు లేదంది.



# గర్ల్‌ఫ్రెండ్‌ను సూట్‌కేసులో కూర్చోబెట్టి..

# బాయ్స్ హాస్టల్‌కు తీసుకెళ్తూ..

**హరియాణా :** ప్రేమించిన అమ్మాయిని కలవానుకున్న ఓ విద్యార్థి పెద్ద సాహసమే చేశాడు. ఏకంగా తన గర్ల్‌ఫ్రెండ్‌ను ఎవరికీ తెలియకుండా సూట్‌కేసులో కూర్చోబెట్టి బాయ్స్ హాస్టల్‌కు తీసుకెళ్లడానికి ప్రయత్నించాడు. అయితే యాజమాన్యానికి అనుమానం వచ్చి సూట్‌కేస్ తెరవడంతో అసలు విషయం బయటపడింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అది వైరల్‌గా మారింది. హరియాణాలోని సోనిపట్‌లో ఉన్న జిందాల్ విశ్వవిద్యాలయానికి చెందిన ఓ విద్యార్థి పెద్ద సూట్‌కేస్‌తో హస్టల్‌లోకి వచ్చాడు. అందులో ఏమున్నాయని సిబ్బంది అడగగా దుస్తులు, వస్తువులు ఉన్నట్లు పేర్కొన్నాడు. అతడి తీరుపై అనుమానం వచ్చిన హాస్టల్ గార్డులు సూట్‌కేస్ తెరవాలని కోరగా అందుకు నిరాకరించాడు. దీంతోవారు ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి.. సూట్‌కేస్‌ను తెరవగా అందులో నుంచి ఓ అమ్మాయి బయటకు రావడంతో అవాక్కయ్యారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఓ విద్యార్థి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. అయితే సూట్‌కేసులో ఉన్న అమ్మాయి అదే విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థా, లేక బయటనుంచి వచ్చిన వ్యక్తా అనే విషయం ఇంకా తెలియరాలేదు. దీనిపై దర్యాప్తు జరుపుతున్నట్లు విశ్వవిద్యాలయ అధికారులు వెల్లడించారు. వీడియో వైరల్‌గా మారడంతో నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఓ నెటిజన్ స్పందిస్తూ.."ఈ మధ్య సూట్ కేసులు ఎన్నో రకాలుగా ఉపయోగపడుతున్నట్టున్నాయి" అంటూ చమత్కరించారు.

# ధాన్యం సేకరణలో అస్పష్ట విధానం!



ధాన్యం కావచ్చు.. పండించిన పంటలు ఏవైనా కావచ్చు.. ఏటా రైతులకు తిప్పలు తప్పడం లేదు. పాలకులు మాటలే తప్ప క్షేత్రస్థాయిలో పథకాలు అమలు కావడం లేదు. కనీస మద్దతు ధరలు ప్రకటించినా వాటిని అమలు చేయడంలో శ్రద్ధ చూపడం లేదు. తాలు పేరుతో, దడవాయి పేరుతో దోచేస్తున్నారు. పంటలకు సకాలంలో రుణాలు అందడం లేదు. బ్యాంకులు కూడా పైకి చెప్పినంతగా ఉదారంగా ఉండడం లేదు. పంటరుణాలను ప్రైవేట్ వ్యక్తుల నుంచే తెచ్చుకోవాల్సి వస్తోంది. దళారులు కొన్న తరవాతే ప్రభుత్వం అధికారులు రంగప్రవేశం చేస్తారు. పంటల కోసం తెచ్చిన పెట్టుబడి అప్పులు తీర్చే తొందరలో ధాన్యాన్ని, పంటలను వచ్చిన రేటుకు, అంటే దళారుల రేటుకు అమ్ముకోక తప్పడం లేదు. ఇదంతా క్షేత్రస్తాయిలో అధికారులకు తెలుసు. మార్కెట్ కమిటీలు పెట్టినా,సహకారసంఘాలు ఉన్నా.. ధాన్యం చేతికొచ్చే సమయానికి తిప్పలు పడక తప్పడం లేదు. పంట ఏదైనా ఇదే దుస్థితి ఉంది. కొనుగోళ్ల విషయంలో ఆందోళనలు రాజకీయపార్టీల బలాబలాల ప్రదర్శనగా ఉందే తప్ప రైతులను ఆదుకునే విధానంలా ఉండడం లేదు. ఇందులో అన్ని పార్టీలు ఎవరికివారు తమవంతు రాజకీయ లాభం కోరే పాత్ర పోషిస్తూ రక్తి కట్టిస్తున్నారు. పాలకులు తమ రాజకీయ విన్యాసాలకు ప్రజలను ఎలా మోసం చేస్తారో స్పష్టంగా కనిపిస్తోంది. జానికి కేంద్రం తీరు కూడా ఏ మాత్రం సరిగా లేదు.ఇందులో ఎలాంటి అనుమానాలు లేవు.

ధాన్యం కొనుగేళ్లే కాదు..అనేకానేక విషయాల్లో కేంద్రాన్ని నిలదీయాల్సిందే. రైతులు బతకడానికే కష్టపడుతున్నారు. మనలను బతికించడానికి వారు వ్యవసాయం చేస్తున్నారు. కేంద్రం పెట్రో, డీజిల్,గ్యాస్ ధరలతో మొత్తంగా అన్ని సరకుల ధరలు పెంచుతూ పోతున్నది. సామాన్యులు నానాయాతనలు పడుతున్నా పట్టించుకోవడం లేదు. అలాగే ధాన్యం ధరలను ఏటేటా పెంచడం లేదు. ఎవరికి వారు ధాన్యం ధరలు ని÷-ణయించుకునే పరిస్థితి లేదు.నిజానికి వ్యవసాయంపై జాతీయ విధానం రావాల్సిందే. ధాన్యం కొనుగోళ్లలో పారదర్శక విధానం రావాలి. వ్యవసాయ దిగుమతులను తగ్గించుకుని..ఎగుమతులను పెంచుకోవాలి. వంటనూనెలను దిగుమతిని ఆపేయాలి. దేశీయంగా పంటలకు ప్రోత్సాహం ఇవ్వాల్సిందే. ఇవన్నీ చర్చించడానికి కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అన్ని రాష్ట్రాల్లో ఏకాభిప్రాయం రావాలి. కానీ అలా జగరడం లేదు. ఎవరి రాజకీయ ప్రయోజనాలు వారు చూసుకుంటున్నారే తప్ప ప్రజలను పట్టించుకోవడం లేదు. రైతుల పట్ల ఎలాంటి వివక్ష చూపడం లేదని కేంద్ర ప్రభుత్వం చెబుతున్న ధాన్యం కొనుగోళ్లు మాత్రం సజావుగా సాడం లేదు. ఇప్పుడు వడగళ్ల వానల కాలం. ధాన్యం కల్లాల్లోకి చేరకముందే తడిసి ముద్దవుతోంది. కల్లాల్లో కొన్నిసార్లు తడిసి కొట్టుకు పోతోంది. ఇదంతా దైవాధీనంగా రైతుల పరిస్థితి ఉంది. మార్కెట్లో పత్తి, మిర్చి, వరి తదితర పంటలు వచ్చినా..ట్రాక్టర్లు బారులు తీరినా సక్రమంగా అమ్ముకుని ఇంటికి చేరుతామన్న ధైర్యం రైతుల్లో ఏ రోజూ కనిపించడం లేదు.

పంజాబ్‌లో ధాన్యాన్ని కొనుగోలు చేసిన తరహాలోనే దేశమంతటా ఒకే విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్రం తెలిపినా ..ఏటేటా మాత్రం ధాన్యం అమ్మకాల వ్యవహారం ప్రహసనంగా మారుతోంది. తెలంగాణలో డీసెంట్రలైజ్ ప్రొక్యూర్‌మెంట్ విధానం (డీసీపీ)లో బియ్యం సేకరిస్తున్నామని.. పంజాబ్ నుంచి నాన్ డీసీపీ విధానంలో సెంట్రల్ పూల్ ద్వారా బియ్యం సేకరించి ఇతర రాష్ట్రాలకు పంపిస్తున్నామని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచీ నేటిదాకా ఒకే విధానం అమల్లో ఉందని కేంద్ర అధికారులు చెప్పారు. తెలంగాణ అవసరాలకు వినియోగించుకోగా మిగిలిన బియ్యాన్ని సెంట్రల్ పూల్ కింద ఎఫ్‌సీఐకి అప్పగిస్తోందని గుర్తు చేశారు. తెలంగాణతోపాటు దక్షిణ భారతదేశం నుంచి ఎఫ్‌సీఐ సేకరించే బాయిల్డ్ రైస్‌ను సెంట్రల్ పూల్ కింద కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు పంపిస్తామని అధికారులు తెలిపారు. తెలంగాణ కూడా పశ్చిమ బెంగాల్, బిహార్‌లకు బాయిల్డ్ రైస్‌ను పంపుతుంది. తెలంగాణలో బాయిల్డ్ రైస్ వినియోగం లేనందున మొత్తం బియ్యాన్ని ఎఫ్‌సీఐకే పంపిస్తూ వస్తోంది. దేశంలో బాయిల్డ్ రైస్ బియ్యానికి డిమాండ్ లేకుండా పోయింది. అంతుకే రా రైస్ మాత్రమే సేకరిస్తున్నారు. నిజంగానే జాతీయ విధానం రావాలంటే అందుకు ప్రత్యామ్నాయంగా ఆయా రాష్ట్రాలను కలుపుకుని పోరాడాలి. అందుకే వరి,మిర్చి తదితరు పంటల కొనుగోళ్ల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏటా విమర్శల పర్వం కొనసాగుతూనే ఉంది. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఒక స్పష్టమైన వైఖరి తీసుకొని.. రైతులకు భరోసా కల్పించాలి. దీనిని కడవరకు ముందుకు తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వాలదే. పడించిన పంటలకు గిట్టుబాటు ధరలు రావాలి. అసలే వడగళ్ల సీజన్‌లో ధాన్యం తడిసినా, చేలో నష్టపోయినా తక్షణం పరిహారం అందాలి. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వారితోనే చర్చించాలి. వారే తమ సమస్యలను వివరించగలరు. పాలకులు ఇన్నేళ్లయినా రైతుల సమస్యలపై అవగాహన కలిగి ఉండడం లేదు. ఈ విధానం పోవాలి. కేంద్ర,రాష్ట్రాలు కలసి పంటల కొనుగోళ్లపై సమగ్రంగా చర్చించాలి. రైతులకు ఏది చేస్తే లాభమో దానిని అనుసరించాలి. దానినే ఖరారు చేయాలి. అప్పుడే మార్పులు రాగలవు.

# అన్నదాతను దెబ్బతీస్తున్న అకాల వర్షాలు

- దళారుల ప్రమేయంతో దక్కని మద్దతు ధరలు
- సకాలంలో ధాన్యం సేకరించలేక పోతున్న ప్రభుత్వం



**నిజామాబాద్, ఏప్రిల్ 12 :** తీవ్రమైన ఎండలు, ఈదురుగాలుల బీభత్సం, అకాల వర్షాలతో ఆదరబాదరగా పంటలను అమ్మేసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఏర్పడింది. ముందుచూపుతో పంట చేతికొచ్చే సమయానికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులు నష్టపోయే అవకాశం ఉండదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించినా..ఎలాంటి ప్రయోజ నం ఉ ఒడదని రైతులు అంటున్నారు. అన్నదాతల అవసరాలు, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దళారులు అందినకాడికి దండుకోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. పంటల సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా అధికారులకు ముందే తెలిసినా.. ముందుచూపు లేకపోవడంతో రైతులు నష్టపోవాల్సి వస్తుంది. పంట వేసిన తర్వాత సుమారు 3, 4 నెలల పాటు సమయం ఉంటుంది. కాని ఏటా పంట కొనుగోళ్లలో జాప్యం జరుగుతూనే ఉంది. ఈ యేడు మొక్కజొన్న పంట కొనుగోళ్లపై సందిగ్ధ పరిస్థితులే కనిపిస్తున్నాయి. ప్రభుత్వం వరికి ప్రత్యామ్నాయ పంటలనే సాగు చేయాలని చెప్పడంతో జిల్లాల్లో భారీగా ఆరుతడి పంటలనే ఎక్కువగా సాగు చేశారు. ఇందులో ప్రధానంగా జొన్న, మొక్క జొన్న, శనగ, తదితర పంటలు సాగయ్యాయి. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ప్రతీసారి కొనుగోళ్ల పక్రియ ఆలస్యం కావడంతో సగం పంట దళారుల పాలవుతూనే ఉంది. ఈసారి కూడా అవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సగం పంట అమ్మిన తర్వాత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉండదంటున్నారు. కొన్ని జిల్లాల్లో మార్క్‌ఫెడ్ అధికారులు సగం పంటలను మాత్రమే కొనుగోలు చేసి టార్గెట్ పూర్తయ్యిందని ప్రకటించుకున్నారు. ఇలాంటి పరిస్థితులకు అవకాశం ఇవ్వకుండా ముందుచూపుతో వ్యవహరిస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు కొనుగోలు పక్రియను మొదలు పెట్టకపోవడంతో మద్దతు ధర కొందరికే దక్కే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే పంట నూర్పిడి చేసిన రైతులు.. బయట మార్కెట్‌లో దళారులను ఆశ్రయించి దిగుబడులను అమ్మేసుకుంటున్నారు. దళారులు ఇంటికే వచ్చి రైతులను మభ్యపెడుతూ తక్కువ ధరకే పంటను కొనుగోలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతేడాది రైతులు ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు చేపట్టడంతోనే దిగొచ్చిన ప్రభు త్వం.. చివరి సమయంలో కొనుగోళ్లు చేపట్టడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షాలకు పంట దిగుబడులు తడవడంతో మద్దతుధరలో కోతలు విధించారు. చేతికొచ్చిన పంటను చేనులోనే కుప్పలుగా పోసి అకాల వర్షాల నుంచి పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడాల్సి వస్తుందని చెబుతున్నారు. వాతావరణం సహకరించకుంటే దిగుబడులు చేతికొచ్చినా.. కష్టంగానే ఉంటుందని వాపోతున్నారు. ఈదురుగాలుల బీభత్సం, అకాల వర్షాలకు పంట దిగుబడులు తడిసిపోయే అవకాశం ఉందని, మరో పక్షం రోజుల్లో అకాల వర్షాలు, ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ఇకనైనా సకాలంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

# మొక్కలే శ్వాసగా.. మొక్కలే ఆశగా ..

- వనజీవి పద్మశ్రీ రామయ్య గుండెపోటుతో మృతి
- కోటి మొక్కలు నాటి రికార్డు సృష్టించిన ప్రకృతి ప్రేమికుడు



**ఖమ్మం, ఏప్రిల్ 12 :** మొక్కలే శ్వాసగా.. మొక్కలే జీవితంగా..మొక్కలే ప్రాణంగా బతికిన ప్రముఖ సామాజిక కార్యకర్త, పద్మశ్రీ వనజీవి రామయ్య కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రామయ్య శనివారం ఉదయం గుండెపోటు రావడంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఆయనను ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. రామయ్య స్వస్థలం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామం. జీవితమంతా మొక్కలు నాటి పెంచారు. కోటికిపైగా మొక్కలు నాటి సరికొత్త చరిత్ర సృష్టించారు. వృక్షో రక్షతి రక్షితః అంటూ నిత్యం ప్రచారంచేసిన ఆయన రోడ్ల పక్కన, పాఠశాలలు, దవాఖానలు, దేవాలయాల్లో మొక్కలు నాటారు. రామయ్య సేవలకుగాను 2017లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. రామయ్యకు భార్య, ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కాగా ఇద్దరు కుమారులు ఇప్పటికే వివిధ కారణాలతో చనిపోయారు. రామయ్య మృతితో ప్రకృతి ప్రేమికులు శోక సంద్రంలో మునిగిపోయారు. రామయ్యను కడసారి చూడటానికి జనం భారీగా తరలి వచ్చారు. బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్, సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సహా పలువురు రాజకీయ నేతలు రామయ్య మృతిపట్ల సంతాపం తెలిపారు. 1937, జూలై 1న దరిపెల్లి లాలయ్య, పుల్లమ్మ దంప తులకు రామయ్య జన్మించారు. ఆయన ఇంటిపేరు దరిపల్లి రామ య్య అయినప్పటికీ వనజీవిగా మార్చుకున్నారు. ఆయనను చెట్ల రామయ్య అనికూడా పిలుస్తారు. 50 ఏండ్లుగా అలుపెరగకుండా విత్తనాలు చల్లుతూ మొక్కలు పెంచేందుకు ప్రయత్నించారు. వేసవిలో విత్తనాలు సేకరించి తొలకరి రాగానే వాటిని ఆయా ప్రాంతాల్లో చల్లుతుండే వారు. ఇలా 120 రకాల మొక్కల చరిత్రను అలవోకగా చెప్పగలరు వనజీవి. మూడు కోట్ల మొక్కలు నాటాలన్నదే తన లక్ష్యమని వనజీవి రామయ్య చెప్తుండేవారు. తెలంగాణ ప్రభుత్వం ఆరో తరగతి సాంఘీక శాస్త్రంలో వనజీవి గురించి పాఠ్యాంశంగా చేర్చింది. అదేవిధంగా మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థుల కోసం 9వ తరగతి తెలుగు పుస్తకంలో రామయ్య జీవితం పాఠ్యాంశంగా బోధిస్తున్నది. రామయ్యకు భార్య జానమ్మ, నలుగురు సంతానం. ఓవైపు కుటుంబ భారాన్ని మోస్తూ నే.. నాలుగు దశాబ్దాలకు పైగా మొక్కలు నాటుతూ వచ్చారు. మను మళ్లు, మనుమరాళ్లకు కూడా ఆయన చెట్ల పేర్లే పెట్టారు. ఒకామె పేరు చందనపుష్ప, ఇంకో మనుమరాలు హరిత లావణ్య. కుబంధపుష్ప అని ఇంకో పాపకు పెట్టాడు. మరో మనవరాలికి వనశ్రీ అని నామకరణం చేశారు. కోటికిపైగా మొక్కలను నాటి ట్రీ మ్యాన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన రామయ్య సేవలకుగా ను పలు సంస్థలు అవార్డులతో సత్కరించాయి. 2005లో సెంటర్ ఫర్ మీడియా సర్వీసెస్ సంస్థ నుంచి మనమిత్ర అవార్డులో ఇచ్చింది. యూనివర్సల్ గ్లోబల్ పీస్ అనే అంతర్జాతీయ సంస్థ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. 1995లో భారత ప్రభుత్వం నుంచి వనసేవా అవార్డు లభించింది.

## వనజీవి రామయ్య మృతికి పలువురు సంతాపం

**హైదరాబాద్, ఏప్రిల్ 12 :** వనజీవి రామయ్య మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన మరణ వార్త తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాల సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు, మాజీ సిఎం కెసిఆర్ తీవ్ర సంతాపం తెలిపారు. పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి పట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ప్రకృతి లేనిదే మనుగడ లేదని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన అని చెప్పారు. వ్యక్తిగా మొక్కలు నాటి సమాజాన్నే ప్రభావితం చేసిన వ్యక్తి రామయ్య అన్నారు. ఆయన మరణం సమాజానికి తీరని లోటు– అని పేర్కొన్నారు. రామయ్య సూచించిన మార్గం నేటి యువతకు ఆదర్శమన్నారు. వనజీవి రామయ్య మరణం పట్ల భారాస అధినేత కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. పచ్చదనం పరిరక్షణ కోసం వనజీవి చేసిన కృషిని స్మరించారు. ఆయన మరణంతో తెలంగాణ ఒక ప్రపంచ పర్యావరణవేత్తను కోల్పోయిందన్నారు. పర్యావరణం కోసం ఆయన చేసిన త్యాగం అసమాన్యమైనదని వివరించారు. హరితహారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన అందించిన సహకారం గొప్పదన్నారు. రామయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రామయ్య మరణ వార్త తెలిసి తీవ్ర విచారానికి లోనైనట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. పచ్చదనం ప్రాధాన్యత చెప్పిన రామయ్య నేటితరానికి ఆదర్శమని చెప్పారు. ఆయన మరణం పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటు–న్నట్లు చెప్పారు. వనజీవి రామయ్య మరణం బాధాకరమని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే సందేశమే ఆయన జీవిత సారాంశమని పేర్కొన్నారు. చెట్ల ఆవశ్యకత చెప్పిన రామయ్యే నిజమైన పర్యావరణ యోధుడని పేర్కొన్నారు. వనజీవి రామయ్య చూపిన మార్గం భావితరాలకు ప్రేరణ అని వివరించారు. పర్యావరణం కోసం జీఇతాంతం తపించిన వ్యక్తి వనజీవి రామయ్య అని ఏపి డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఆయన మరణం వృక్షరక్షణకు పాటుపడుతున్న వారికి తీరని లోటన్నారు. పెద్దగా చదువుకోకున్నా ప్రకృతిని ఆస్వాదించి, పరిరక్షించేందుకు చూపిన మార్గం అనుసరణీయమని అన్నారు. మనమంతా మొక్కలు నాటుతూ ముందుకు సాగడమే ఆయనకు అందించే నివాళి

# నల్లగొండ పట్టణంలో వ్యక్తి దారుణ హత్య



**నల్లగొండ, ఏప్రిల్ 12 :** నల్లగొండ జిల్లా కేంద్రంలో గురువారం రాత్రి దారుణ హత్య జరిగింది. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పక్కనే గుర్తుతెలియని దుండగులు వేటకొడవళ్లతో ఓ వ్యక్తిని నరికి చంపేశారు. రామగిరి ప్రాంతంలోని గీతాంజలి కాంప్లెక్స్‌లో సురేశ్ (37) మణికంఠ లేజర్ కలర్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నారు. రాత్రి సమయంలో సురేష్ ల్యాబ్‌లో ఉండగా, గుర్తు తెలియని దుండగులు మాస్కులతో వచ్చి వేట కత్తులతో ఒక్కసారిగా దాడిచేశారు. గుండెలో, మెడపై దారుణంగా నరికారు. తప్పించుకునే ప్రయత్నం చేసినా దుండగులు వదిలిపెట్టలేదు. దీంతో ఘటనా స్థలంలోని ఆయన మృతిచెందారు. కుటుంబ కలహాలా, పాత కక్షలు ఏమైనా ఉన్నాయా.. అనే కోణంలో టూ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ శివరాం రెడ్డి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలించారు.



# జమిలి ఎన్నికలతో దేశానికి మేలు

- ఎన్నికల ఖర్చు భారీగా తగ్గించుకోవచ్చు
- గతంలో ఒకే దఫాలో ఎన్నికలు జరిగాయి
- కేవలం రాజకీయ కోణంతోనే జమిలిపై వ్యతిరేకత
- రాజకీయాల్లో భాషను జాగ్రత్తగా వాడాలి
- తిరుపతిలో ఒకేదేశం-ఒకే ఎన్నిక సదస్సులో వెంకయ్య

**తిరుపతి, ఏప్రిల్ 12 :** జమిలి ఎన్నికల వల్ల ప్రాంతీయ పార్టీలకు ఇబ్బంది అనేది అపోహ అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఒకప్పుడు ఎన్నికలన్నీ కలిసే జరిగాయన్న విషయం మరచి మాట్లాడుతున్నారని అన్నారు. కలసి ఎన్నికలు జరగడం దేశానికి మంచిదన్నారు. తిరుపతిలో 'ఒకే దేశం–ఒకే ఎన్నిక' అంశంపై నిర్వహించిన మేధావుల సదస్సులో ఆయన మాట్లాడారు. సాంకేతికత సాయంతో జమిలి ఎన్నికలు జరపడం కష్టం కాదని చెప్పారు. కొన్ని పార్టీలు దీన్ని వ్యతిరేకించడంలో రాజకీయ కోణం తప్ప మరేమీ లేదని పేర్కొన్నారు. జమిలి ద్వారా ఎన్నికల ఖర్చు ఆదా అవుతుందన్నారు. అధికారం పోతే కొన్ని పార్టీలు తట్టుకోలేకపోతున్నాయని, సంయమనం కోల్పోతున్నాయని ఎద్దేవా చేశారు. పార్టీ ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి చేటు అని పేర్కొన్నారు. పార్టీ మారే నేతలు పదవికి రాజీనామా చేయాలనే నిబంధన రావాలని వెంకయ్యనాయుడు సూచించారు. అలాగే రాజకీయనేతలు సంయమనంతో మాట్లాడాలని, నిందలు, అసభ్య పదజాలం ఉపయోగించే సంస్కృతి మంచిది కాదన్నారు. గత ఎన్నికలలో బూతులు మాట్లాడిన నేతలు అందరూ ఓడిపోయారు.. వారు ఎవరో మీకే తెలుసు అంటూ సెటైర్లు వేశారు. అసెంబ్లీలో అభివృద్ధి, సిద్ధాంతాలు, సమస్యలపై చర్చల కంటే నేతల బూతులు ఎక్కువయ్యాయి.. అసెంబ్లీలో బట్టలు చించుకుని కొట్టుకునే పరిస్థితికి తెచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు.. ఇంట్లో ఉండే అమ్మను, భార్యను తమ నేతలతో బూతులు తిట్టించి కొందరు రాక్షసానందం పొందారన్న ఆయన.. నువ్వే నా.. మేం అంతే అంటూ మరికొద్దిమంది బూతులు మాట్లాడుతున్నారని అన్నారు. గత ఎన్నికలలో భూతులు మాట్లాడిన నేతలు అందరూ ఓడిపోయారు.. వారు ఎవరో మీకే తెలుసు.. ప్రజలు అందరూ ఆ నేతల బూతులు వినలేక.. పోలింగ్ బూత్‌లోకి వెళ్లి ఓటు వేసి ఓడించారు.. బూతులు కంటే పోలింగ్ భూత్ గొప్పది.. బలమైనది అని పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండాలి.. భాషను జాగ్రత్తగా వాడాలి అని వెంకయ్య నాయుడు సూచించారు.. ఇక, ఉచిత పథకాలకు నేను వ్యతిరేకం... చదువు, వైద్యం మాత్రమే ఉచితంగా ఇవ్వాలి.. కానీ, ఉచితపథకాల వల్ల నష్టం తప్ప లాభం ఉండదు అన్నారు.. మరోవైపు, ఒకే దేశం ఒకే ఎన్నిక వల్ల సమయం ఆదా, ఖర్చు ఆదా అవుతుందన్నారు.. ఎన్నికల ఖర్చు వేలకోట్లుకు చేరింది.. నేను ఎమ్మెల్యేగా పోటీ చేసిన సమయంలో ప్రజలు విరాళంగా కొంత డబ్బులు ఇచ్చారు.. నేను రూపాయల జేబులో నుండి తీయలేదు.. ఒక్క రూపాయి జేబులో వేసుకోలేదని గుర్తుచేసుకున్నారు.. రాజకీయాల్లో కులం, ధనం, మతం లేకుండా చేయాలి.. కానీ, కులం, డబ్బులు, క్రిమినల్స్‌కి ఇప్పుడున్న పార్టీలు ప్రధాన్యత ఇస్తున్నాయన్నారు. ఇది విపరీత పరిణామాలకు దారితీస్తోందని గుర్తించాలని అన్నారు.



## నేడే అభఆంజనేయ స్వామి రథోత్సవం

**అమీనాబాద్, ప్రజా జ్యోతి తుగ్గలి :** మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామంలో వెలసిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి రథోత్సవం ఆదివారం జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. వారు మాట్లాడుతూ గుడి లో ఉదయం 5 గంటల లే ప్రత్యేక పూజలు కార్యక్రమలతో ప్రారంభించి, ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు అశేష భక్త జనవాహిని మధ్య గ్రామ పెద్దలు మరియు ప్రజల సమక్షంలో రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని,రథోత్సవ కార్యక్రమాన్ని ముగిసిన తరువాత రాత్రి 8:00 గంటలకు చెక్కభజన కార్యక్రమం ఉంటుందనిగ్రామ పెద్దలు మధ్య ఎంప్లాయిస్ అసోసియేషన్ సమక్షంలో జరుగుతుందని వారు తెలిపారు, భక్తాదులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు.



## ఎస్టీ కాలనీలో ఎమ్మెల్యే చొరవతో
# వాటర్ ట్యాంక్ మంజూరు
### నిర్మాణం కొరకు స్థలాన్ని పరిశీలించిన పంచాయతీ ఈ. ఓ ,టీడిపి నేతలు

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు పంచాయతీ పరిధిలో గల 16వ వార్డు ఎస్టీ కాలనీ వాసులకు గత ఎన్నో ఏళ్లుగా త్రాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో కాలనీ వాసుల సమస్యలు ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే , రాష్ట్ర పియూసి చైర్మెన్ కూన రవికుమార్ దృష్టికి చేరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. తక్షణమే జలజీవన్ మిషన్ నిధులతో ఆ కాలనీ వాసులకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టేందుకు పంచాయతీ ఈ. ఓ కింతలి మోహన్ బాబు , టీడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ , స్థానిక సర్పంచ్ రేగిడి లక్ష్మి ,టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి , మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే వాటర్ టాంక్ నిర్మాణం చేపట్టి కాలనీ వాసులకు ఎటువంటి త్రాగునీటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని వారు తెలిపారు.



## లక్ష్మీ నరసింహ స్వామి రథోత్సవం
### పాల్గొన్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

**బాపట్ల ఏప్రిల్ 12( ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) :** పిట్టలవానిపాలెం మండలం అల్లూరు గ్రామంలో ప్రసిద్దిగాంచిన శ్రీ రాజ్యలక్ష్మి సమేత శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దివ్య రాథోత్సవం కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు ఈ సందర్భంగా భక్తిశ్రద్ధలతో ఎమ్మెల్యే స్వామివారికి పూజలు చేసి భక్తులతో కలిసి రథోత్సవంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ,నాగరాజు, రవి, మరియు తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు

# ముగిసిన ఎమ్మెల్యే కూన రవికుమార్ స్వదేశీ పర్యటన

- నేడు శ్రీకాకుళం పట్టణానికి రాక
- ఘనంగా స్వాగతం పలుకుతున్న జిల్లా టిడిపి నేతలు



**పొందూరు (ఆమదాలవలస), ప్రజా జ్యోతి న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే దిశగా ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే, రాష్ట్ర పియూసి చైర్మెన్ కూన రవికుమార్ తన 15 రోజుల స్వదేశీ పర్యటనను విజయవంతంగా ముగించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోషియేషన్ మొదటి నేషనల్ కన్వెన్షన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కూన రవికుమార్ రాష్ట్ర అభివృద్ధి కొరకు పరిశ్రమలు నెలకొల్పే దిశగా డల్లాస్, చార్లెట్ వంటి నగరాలలో విస్తృతంగా పర్యటించారు. గూగుల్ వంటి ప్రముఖ సంస్థను సందర్శించి , అక్కడి సీనియర్ డైరెక్టర్ ఇంజనీర్లను కలిసి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ లో ఆంధ్ర రాష్ట్రాన్ని ముందుంచి , యువతకు ఉపాధి కల్పించాలన్న చంద్రబాబు నాయుడి సంకల్పాన్ని సాకారం చేసేందుకు ఆంధ్ర రాష్ట్రంలో సంస్థ ను ఏర్పాటు చేసేలా వారిని ఒప్పించారు. ప్రభుత్వ విజన్ 2047 కు , పి 4 విధానం లో రాష్ట్ర అభివృద్ధికి ఎన్నారైల ను కలుపుకుని రాష్ట్ర అభివృద్ధికి ఎన్నారైలు సహకారం అందించేలా ప్రేరేపించి , అంతర్జాతీయ స్థాయిలో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ వేడుకలను నిర్వహించి అమెరికా పర్యటనను విజయవంతంగా ముగించుకుని శ్రీకాకుళం లో అడుగుపెడుతున్న ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే కూన రవికుమార్ కు పొందూరు పి. ఎ.సి.ఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకట సత్యన్నారాయణ , టీడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిల పల్లి రామ్మోహన్ , ఎ.ఎం.సి మాజీ చైర్మెన్ అన్నెపు రాము , జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు,జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు, టీడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ, ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి హారిక ,పొందూరు పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ , మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మి ,స్వదేశీ ఆగమన శుభాకాంక్షలు తెలుపుతూ ఘనంగా స్వాగతం పలుకుతు న్నారు. వీరితో పాటు నాలుగు మండల టిడిపి నాయకులు , కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

# భక్తుల కొలహాలం నడుమ హనుమాన్ విజయోత్సవ ర్యాలీ

**గుంతకల్లు ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి):** శనివారం హనుమాన్ విజయోత్సవం(జన్మోయోత్సవం) పురస్కరించుకొని విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్,అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని బళ్లారి సర్కిల్ లోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించిన రథంపై వీరా హనుమాన్ విగ్రహాన్ని ఏర్పాటుచేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాణిక్చంద్ కార్వా, రఘురాం, బజరంగ్ దళ్ సంయోజక్ సంజీవరెడ్డి, గో రక్ష ప్రముఖ రంగస్వామి, సహాయ కార్యదర్శి కోనంకి బిందు, జిల్లా కార్యదర్శి విశ్వనాథం, సత్రశాల జగదీష్ గుప్తా, బజరంగ్దళ్ రాష్ట్ర కో కన్వీనర్ కసాపురం రవి ఈ ర్యాలీని జండా ఊపి విజయోత్సవ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ హనుమాన్ సర్కిల్ నుండి బీరప్ప గుడి, పాత గుంతకల్లు,60 అడుగుల రోడ్డు,5పొట్టి శ్రీరాములు సర్కిల్,కూరగాయల మార్కెట్ రోడ్డు మీదుగా కసాపురం ఆంజనేయస్వామి దేవాలయం వరకు జైశ్రీరామ్, జై హనుమాన్, భారత్ మాతాకీ జై అనే నినాదాలతో భక్తుల కోలాహలం నడుమ ర్యాలీ నిర్వహించారు. ఈ



కార్యక్రమంలో బిజెపి నాయకులు శేకన్న,రంగన్న, కొలిమి రామాంజనేయులు, కృష్ణమూర్తి,పురంధర్, ఆర్ఎస్ఎస్ నాయకులు పద్మ కృష్ణ మోహన్, కవిత,గద్వాల్ ప్రతాప్, సౌజన్య, పరిమళాచారి,మునిస్వామి,బ్రహ్మయ్య, ఆంజనేయులు, ఆనంద్ సింగ్, రాయల్ రంగ,భాస్కర్, జనార్ధన్ నాయుడు మరియు బిజెపి, హిందూ సంఘాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు, హిందూ బంధువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆ వీడియో ఏడు సంవత్సరాల క్రితంది

- అనకాపల్లి రూరల్ సిఐ వివరణ..
- అటువంటి వీడియోలు పెడితే కఠిన చర్యలు

**అనకాపల్లి, ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) :** అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిసినికాడ గ్రామంలో శివాలయం వద్ద, ఇద్దరు వ్యక్తులు వికృత చేష్టల తో భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తున్న వీడియో వైరల్ అయినా నేపథ్యంలో అనకాపల్లి రూరల్ సీఐ జి అశోక్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయన కథనం మేరకు ఈ ఘటన 2018 ఏప్రిల్ 16న జరిగిందని అప్పట్లో ఇద్దరూ బాల నేరస్థులను అరెస్టు చేసి విశాఖపట్నం 2 వ అడిషనల్ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు మరియు బాల నేరస్తుల కోర్టు ముందు హాజరు పరచగా, కోర్టు ఆదేశాల మేరకు జువనైల్ హోమ్‌కు తరలించినట్లు చెప్పారు. అనంతరం అదే ఏడాది నవంబర్ 22న న్యాయస్థానం ఇద్దరు నిందితులకు శిక్ష విధించినట్లు సిఐ పేర్కొన్నారు. ఇటీవల వైరల్ అవుతున్న వీడియో గత సంఘటనకు సంబంధించింది. వాస్తవాలు తెలుసుకోకుం



డా, ఈ వీడియోను ప్రస్తుత ఘటనగా చెబుతూ సామాజిక మాధ్యమాలలో షేర్ చేయడం, కామెంట్లు చేయడం వల్ల ప్రజల్లో అపోహలు కలుగుతున్నాయి అన్నారు. అందువల్ల, ప్రజలు వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరూ ఎటువంటి వీడియోలు షేర్ చేయవద్దని, చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ విజ్ఞప్తి చేశారు.

## టిడిపి సీనియర్ కార్యకర్త మృతి
### - ప్రగాఢ సానుభూతి తెలిపిన నేతలు



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం లక్షింపేట గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త మాసాడ అప్పారావు శనివారం తన తుదిశ్వాస విడిచారు. ఈ విషయం తెలిసిన టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ , ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి ఎంపీటీసీ 4 బాడాన హారిక , టీడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి శ్రీనివాస రావు , మాజీ ఏ.ఎం.సి చైర్మెన్ అన్నెపు రాము , టీడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చినరంగ ,ఎంపీటీసీ 2 అనకాపల్లి వాణి , మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మి ,మొకర సత్యన్నారాయణ ,అక్కమాంబ టైలర్ యూనియన్ , వైకాపా పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలియజేశారు.



## తిరుమలలో మహా అపచారం

**ఏప్రిల్ 12,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** ఇటీవలే ఘాట్ రోడ్ లో యువకులు హల్చల్ చేసిన విషయం మరవక ముందే తిరుమలలో మరొక అపచారం జరిగింది. కొందరు భక్తులు చెప్పులు లాంటివి తొడుక్కొని దర్శనానికి వెళ్లడానికి ప్రయత్నించారు. మహా ద్వారం వద్ద ఉన్న సిబ్బంది ఈ విషయాన్ని గమనించి వారిని మహాద్వారం వద్ద నిలువరించి పాద రక్షణ వారి చేత తొలగించి తరువాత దర్శనానికి అనుమతించారు. కానీ మూడు సెక్యూరిటీ పాయింట్లను దాటి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుండి మహాద్వారం వరకు వారు పాదరక్షలు ధరించి ఎలా వచ్చారు అని భక్తులు ప్రశ్నిస్తు న్నారు. విజిలెన్స్ సిబ్బంది తీరుపై భక్తులు విమర్శలను గుప్పిస్తున్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా చూసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



## ప్రణీత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

**ఏప్రిల్ 12,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** ఆధ్యాత్మిక నగరమైన తిరుపతికి విచ్చేసే భక్తులకు నిరంతరం సేవలందిస్తున్న ఆటో కార్మికులకు వేసవి నుండి ఉపశమనం కలిగించడానికి తిరుపతి, కపిల తీర్థం రోడ్డు వద్ద గల శ్రీవారి సన్నిధి ఎదురుగా గల శ్రీవారి సన్నిధి ఆటో స్టాండ్ వారి కోరిక మేరకు ప్రణీత్ ఫౌండేషన్ వారు ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మొదటగా 250 లీటర్లలి తో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ప్రణీత్ ఫౌండేషన్ వారు ప్రారంభించారు. ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని టీటీడీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు కే కిషోర్ కుమార్ ప్రారంభించారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాలలో ప్రజలకు వేసవి దాహార్తిని తీర్చడానికి మరిన్ని చలివేంద్రాలను ప్రణీత్ ఫౌండేషన్ వారు ప్రారంభించనున్నారు



## వధూవరులను ఆశీర్వదించిన మురళిరాజు

**కాకినాడ జిల్లా ఏప్రిల్ 12 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్ :** ప్రత్తిపాడు మండలం ధర్మవరం జగనన్న కాలనీ లో జరుగుచున్న దుర్గాడ వీరబాబు కుమార్తె వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఎం.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ముదునూరి సీతారామరాజు కోలా తాతబాబు బొల్లు నాగేశ్వరరావు పోకనాటి వెంకటేశ్వరరావు జువ్వల దొరబాబు దొడ్డిపట్ల కృష్ణ ఉల్లంకల చంద్రం సిద్ధ అప్పలరాజు సిద్ధ బాబ్జి దొడ్డిపట్ల శివ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు



## శ్రీరామనవమి ఉత్సవాల ప్రత్యేక పూజ
### పాల్గొన్న జనసేన సమన్వయకర్త

**బాపట్ల ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) :** శ్రీరామనవమి నవరాత్రులలో భాగంగా బాపట్ల పట్టణంలోని రథం బజార్ సెంటర్లో ఏర్పాటుచేసిన మండపంలో శ్రీరామనవమి ఉత్సవ కమిటీ నిర్వహించిన ప్రత్యేక పూజలో బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామాన వెంకట శివన్నారాయణ పాల్గొన్నారు అనంతరం శ్రీరామ్ బైక్ ర్యాలీలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా సెక్రెటరీ కొట్ర రామకృష్ణ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సిపిఎం సీనియర్ నాయకురాలు
# అల్లం మాణిక్య మృతి

**పోడూరు /ఆచంట, ఏప్రిల్12, ప్రజాజ్యోతి న్యూస్ :** ఆచంట వేమవరం గ్రామానికి చెందినసిపిఎం, సీనియర్ మహిళా సంఘం నాయకురాలు కామ్రేడ్ అల్లం నాగ మాణిక్యం (92)అలియాస్ (నాగమ్మ) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈమెకుఅల్లం నాగ మల్లయ్య, అల్లం సోమ చంద్రరావు ఇద్దరు కుమారులు కలరు. ఈమె 1975 నుంచి 2025 సుమారు వరకు ఐదు దశాబ్దాలుగా సిపిఎం సభ్యురాలుగా కొనసాగారు. ఈ సందర్భంగా నాగమ్మ పార్థివ దేహంపై సిపిఎం శాఖా కార్యదర్శిగుత్తుల రంగారావు పూలమాలేసి ఘనంగానివాళులర్పించారుఅనంతరం మండల కార్యదర్శి పి మోహన్ రావుపార్టీ జెండాను కప్పి నివాళులర్పించారు. ఆమె మృతదేహాన్నికి శనివారం ఉదయం కుల ఆచారం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఎర్రజెండాలతో ర్యాలీగాకార్యకర్తలు ఆమె అంత్యక్రియలో పాల్గొని విప్లవ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఎస్ వి ఎన్ శర్మ, సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు, సీనియర్ నాయకులు తోటపల్లి సత్యనారాయణ, బండి రంగారావు, సిర్రా విగ్నేశ్వరుడు, కొండేటి సత్యనారాయణ, గెద్దాడ త్రిమూర్తులు, రాపాక సత్యనారాయణ ఏ కేవీ సత్యనారాయణ, తదితరులు కుటుంబ సభ్యులను పరామర్శించి అంత్యక్రియలో పాల్గొన్నారు. ఆమె మృతి పట్లపార్టీకి తీరని లోటని సిపిఎం జిల్లా కార్యదర్శి జెహావిన్ వి గోపాలన్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, కేత గోపాలన్, సిపిఎం మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, జిల్లా నాయకులు జక్కం శెట్టి సత్యనారాయణ, తదితరులు కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.



## ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నిర్వహించిన
# ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

**ఏప్రిల్ 12,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** తిరుపతిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గత కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుంది. స్థానిక సమస్యలపై ప్రజా దర్బార్ లో ఎమ్మెల్యేకు, పజలు వినతులు అందించగా.. ఆ సమస్యల పరిష్కారం కావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు శనివారం ఉదయం ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని తన నివాసం వద్ద నిర్వహించారు. ఈ ప్రజా దర్బార్ లో స్థానిక ప్రజల నుంచి మొత్తం 49 వినతులు రాగా.. ఆ వినతుల్లో మున్సిపల్ కార్పోరేషన్ కు సంబంధించి 15 వినతులు, రెవెన్యూ శాఖకు సంబంధించి ఒక వినతి, టిటిడికి సంబంధించి తొమ్మిది, పోలీసు శాఖకు సంబంధించి రెండు, విద్యుత్ శాఖకు సంబంధించి నాలుగు, సిఎంఆర్ ఎఫ్ కు సంబంధించి ముగ్గురు ఎమ్మెల్యేకి వినతి పత్రాలు అందించారు. మిగిలిన వాటిలో అవుట్ సోర్సింగ్ లో జాబ్ లు, కళాశాలల ఫీజు తగ్గింపులకు సంబంధించినవి ఉన్నాయి. వచ్చిన వినతులను వేరుపరిచి, ఆయా శాఖలకు.. ప్రజల నుంచి వచ్చిన వినతులను మొదటి ప్రాధాన్యత కింద పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పోరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, విద్యుత్ శాఖ ఏఈ రజనీ, సచివాలయం ఉద్యోగులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ప్రజల భద్రత, నేరాల నియంత్రణలో
# సిసి కెమెరాల పాత్ర కీలకం

### జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**విజయనగరం, ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్,.) :** ప్రజల భద్రత, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ పేర్కొన్నారు. ప్రజలకు సిసి కెమెరాల ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలను ఎస్పీ వివరించారు. ఈ మేరక అవగాహన కల్పిస్తూ ప్రార్ధన మందిరాలు, విగ్రహాల వద్ద సిసి కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణలోను, శాంతిభద్రత పరిరక్షణలోను సిసి కెమెరాల పాత్ర ఎంతో ఉందన్నారు. ప్రజల భద్రతలో సిసి కెమెరాల పాత్రను గుర్తించి, వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ,నేరాలను చేధించుటలో సిసి కెమెరాలు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. పబ్లిక్ మరియు ప్రైవేటు స్థలాల్లో సిసి కెమెరాలు ఏర్పాటుతో చోరీలు, దొంగతనాలు, ఇతర నేరాలు జరగకుండా నియంత్రించవచ్చునన్నారు. ఒకవేళ నేరం జరిగితే నేరం జరిగిన తీరును సిసి కెమెరాలు రికార్డు చేయడం వలన, ఫుటేజులు పరిశీలించి, వాటి ఆధారంగా కేసులదర్యాప్తు చేపట్టడం, నేరస్థులను గుర్తించి, ఆయా కేసులను చేధించే అవకాశం ఉంటుందన్నారు. కొన్ని సందర్భాల్లో సిసి ఫుటేజులు ఆధారంగా సాక్ష్యాల సేకరణకు, కార్యాలయాల్లో, వ్యాపార లావాదేవీల్లో పర్యవేక్షణకు సిసి కెమెరాలుఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. పాఠశాలలు, విద్యాలయాలు, ఆసుపత్రుల్లోను, ముఖ్య కూడళ్ళలోను,వాణిజ్య సముదాయాలు, అపార్టుమెంట్లులో సిసి కెమెరాలను ఏర్పాటు చేయడం వల్ల ప్రజల భద్రతకు భరోసా లభిస్తుందన్నారు. మత కలహాలను, దొంగతనాలను నియంత్రించుటలో భాగంగా దేవాలయాలు, చర్చిలు, మసీదుల వద్ద కూడా సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. అదే విధంగా దేవతామూర్తులు, దేశ నాయకుల విగ్రహాల భద్రతకు సిసి కెమెరాల పర్యవేక్షణ అవసరమన్నారు. కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు, అపార్టుమెంటు వాసులు, ప్రార్ధన మందిరాల యజమానులకు వివరించి, ప్రజల భద్రత దృష్ట్యా స్వచ్ఛందంగా సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకొనే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా ప్రజలకు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించేందుకు మహిళా పోలీసుల సేవలను వినియోగించుకోవాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. జిల్లాలో నూతనంగా 3000 సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా చేసుకొని, ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా స్థానికుల సహకారంతో 2125 సిసి కెమెరాలను ఏర్పాటు చేసామని ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.సిసి కెమెరాల ఏర్పాటు ప్రక్రియను ఆయా సబ్ డివిజను అధికారులు ప్రతీరోజూ పర్యవేక్షించాలని విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బిలి డిఎస్పీ జిభవ్యరెడ్డి, చీపురుపల్లి డిఎస్పీ ఎస్. రాఘవులును జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఈ సందర్భంగా ఆదేశించారు.



## టిడిపి సభ్యత్వం కార్డులు
# పంపిణీ చేస్తున్న రాజశేఖర్

**ప్రజాజ్యోతి తుగ్గలి :** తుగ్గలి మండలం పరిధిలోని రామాపురం గ్రామంలో పత్తికొండ ఎమ్మెల్యే కెయి శ్యామ్ కుమార్ ఆదేశాల మేరకు టిడిపి నాయకుడు రాజశేఖర్ తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేసుకున్న పార్టీ కార్యకర్తలకు వారి కుటుంబ సభ్యులకు తెలుగు దేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో రాష్ట్రంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు మహిళలు యువతి యువకులు ఎవ్వరూ కూడా నష్టపోకూడదని పార్టీ కోసం పని చేసిన టీడీపీ కుటుంబ సభ్యులు బాగుకోసం పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను పూర్తి చేశారు.పార్టీ సభ్యత్వం పొందిన ప్రతి కార్యకర్తలు అభిమానులు మహిళలు యువతి యువకులు ఎవ్వరి కుటుంబాలలో అయినా ప్రమాదవశాత్తు మరనించినా,సాదారణ మరణాలు సంభవించినా పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మృతి చెందిన కుటుంబాలకు ప్రమాదంలో మరణిస్తే 5లక్షల రూపాయలను,సాదారణ మరణాలు సంభవించినా వారికి 2లక్షల రూపాయల నగదును ఆర్థిక సాయంగా అందించేందుకు పార్టీ కట్టుబడి ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మదిరి గులెప్పు, గంపల నారాయణస్వామి, నాగరాజు, మద్దికేర నారాయణస్వామి,తదితరులు పాల్గొన్నారు.

## నిద్రావస్థలో ఉన్న టీటీడీ సిబ్బందిపై
# కఠిన చర్యలు తీసుకోవాలి

- టీటీడీ చైర్మన్, ఈఓ క్షమాపణలు చెప్పాలి
- తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు డిమాండ్



**ఏప్రిల్ 12,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** తిరుమలలో టీటీడీ విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది నిద్రవస్థలో ఉన్నారని అందుకే కొందరు భక్తులు పాదరక్షలతో శ్రీవారి మహా ద్వారం వరకు రాగలిగారని తక్షణం ఇందుకు కారణమైన సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు డిమాండ్ చేశారు. శనివారం ముగ్గురు భక్తులు పాదరక్షలతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచి ఆలయ మహాద్వారం వరకు మూడు సెక్యూరిటీ పాయింట్లు దాటుకుని పాదరక్షలతో వస్తున్నా గుర్తించకపోవడం దారుణ వైఫల్యం అని మండిపడ్డారు. ఖద్దరు చొక్కాలతో కాస్త క్లాస్ గా కనిపిస్తే వారి వైపు కన్నెత్తి కూడా సిబ్బంది చూడటం లేదని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. పాదరక్షలతో వచ్చిన భక్తులకు వారుచేసిన తప్పు తెలిసేలా తిరిగి వెనక్కి పంపించకుండా వారి పాదరక్షలు ఆలయ మహాద్వారం ముందు పెట్టించి వారిని ఆలయంలోకి పంపించి మరో తప్పు చేశారన్నారు. తప్పు చేసిన భక్తులు దర్శనం చేసుకుని వెలుపలికి వచ్చేంతవరకు వారి పాదరక్షలు ఆలయం మహాద్వారం వద్ద ఉంచి సిబ్బంది మరో తప్పు చేశారన్నారు. ఇప్పటికే విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది నిర్లక్ష్యం, నిద్రా వస్థ కారణంగా ఆలయ పవిత్రతకు భంగం కలుగుతోందని భక్తులు ఆవేదన చెందుతున్నారని ఆయన విమర్శించారు. తప్పులు మీద తప్పులు జరుగుతున్నా వీటిని చూసి చూడనట్లుగా వదిలివేయడం టిటిడి అధికారులకు కూడా పరిపాటిగా మారుతోందన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పాదరక్షలతో వచ్చిన భక్తులకు జరిమానాలు విధించాలని, వీరిని గుర్తించని సెక్యూరిటీ సిబ్బందిపై కూడా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తక్షణం వారిని అక్కడ నుంచి మరోచోటికి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. దీనికి బాధ్యత వహిస్తూ టీటీడీ ఈవో, చైర్మన్ శ్రీవారి భక్తులకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.



## ఎస్టీ కాలనీ లో ఎమ్మెల్యే చొరవతో
# వాటర్ ట్యాంక్ మంజూరు

### నిర్మాణం కొరకు స్థలాన్ని పరిశీలించిన పంచాయతీ ఈ. ఓ ,టీడిపి నేతలు

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు పంచాయతీ పరిధిలో గల 16వ వార్డు ఎస్టీ కాలనీ వాసులకు గత ఎన్నో ఏళ్లుగా త్రాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. దీంతో కాలనీ వాసుల సమస్యలు ఆమదాలవలస నియోజకవర్గం ఎమ్మెల్యే , రాష్ట్ర పియూసి చైర్మెన్ కూన రవికుమార్ దృష్టికి చేరడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. తక్షణమే జలజీవన్ మిషన్ నిధులతో ఆ కాలనీ వాసులకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టేందుకు పంచాయతీ ఈ. ఓ కింతలి మోహన్ బాబు , టీడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ , స్థానిక సర్పంచ్ రేగిడి లక్ష్మి ,టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి , మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి స్థలాన్ని పరిశీలించారు. త్వరలోనే వాటర్ టాంక్ నిర్మాణం చేపట్టి కాలనీ వాసులకు ఎటువంటి త్రాగునీటి సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని వారు తెలిపారు.



## వైభవంగా ముగిసిన
# శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు

**ఏప్రిల్ 12,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** తిరుమల శ్రీవారి ఆలయం వెనుక వైపు గల వసంతోత్సవ మండపంలో గత మూడురోజులపాటు అంగరంగ వైభవంగా జరిగిన సాలకట్ల వసంతోత్సవాలు శనివారం కన్నులపండుగగా ముగిశాయి. తొలిరోజు, రెండవరోజు శ్రీ మలయప్పస్వామివారు తన ఉభయదేవేరులతో కలిసి వసంతోత్సవంలో పాల్గొనగా చివరిరోజున శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పతో బాటుగా శ్రీ సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామివారు, శ్రీరుక్మిణీ సమేత శ్రీకృష్ణస్వామివారు వసంతోత్సవ సేవలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆద్యంతం నేత్రపర్వంగా సాగింది. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేశారు. ఒకే వేదికపై సమస్త మూలవరులను దర్శించిన భక్తులు తన్మయత్వంతో పులకించారు. అదేవిధంగా ప్రతినెలా పౌర్ణమినాడు తిరుమలలో నిర్వహించే గరుడుసేవను వార్షిక వసంతోత్సవాల కారణంగా టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పేష్కార్ రామ కృష్ణ, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# సూపర్ సిక్స్ హామీలు అమలుకు ఉద్యమిస్తాం

### వైఎస్ఆర్సిపి రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి



**ప్రజా జ్యోతి తుగ్గలి :** సూపర్ సిక్స్ హామీల అమలు కోసం ఉద్యమిస్తామని వైఎస్ఆర్సిపి రైతు విభాగ రాష్ట్ర కార్యదర్శి తుగ్గలి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు సీఎం అయ్యాక పింఛన్లు మాత్రమే అందిస్తున్నారని, అందులోనూ కోతలకు సిద్ధమవుతున్నారని అన్నారు. ఆర్థిక సమస్యలు అంటూ సూపర్ సిక్స్ హామీలను ఎగ్గొట్టడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. చంద్రబాబు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ హామీలు ఇచ్చినప్పుడే అప్పటి సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆర్థిక పరిస్థితులను బేరీజు వేసుకుని తాను ఇస్తున్న పథకాల కంటే ఎక్కువగా చంద్రబాబు సంక్షేమ పథకాలను ఇవ్వలేరని చెప్పారని తెలిపారు. కానీ 14 ఏళు సీఎంగా, ఎన్టీఆర్ క్యాబినెట్‌లో ఆర్థిక మంత్రిగా పని చేసిన చంద్రబాబు తో పాటు బీజేపీ నేతలు, పవన్ కళ్యాణ్‌లు మేమున్నాం ,సూపర్ సిక్స్ అమలు చేస్తాం, అంటూ ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టారని తెలిపారు. ఆనాడు వైయస్ జగన్మోహన్ రెడ్డి అప్పులు చేశారని చెబుతూనే సంపద సృష్టించి సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తామంటూ చంద్రబాబు అన్నారన్నారు. ఎంతో అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు తీరా ఇప్పుడు ప్రజల కు ఇచ్చిన హామీల అమలు చేయడం లేదని అన్నారు. అందువల్ల ఈ పథకాల అమలు చేసే విధంగా తాము ప్రభుత్వం పై పోరాటాలకు సిద్ధమవుతున్నామని తెలిపారు.



## జ్యోతుల నెహ్రూ తిరుమల పర్యటనలో మెరిసిన
## తిరుమల టిడిపి సీనియర్ నాయకులు పవన్ కుమార్

**ఏప్రిల్ 11,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** తిరుమల తిరుపతి దేవస్థాన (టిటిడి) పాలక మండలి సభ్యుడు, టీడీపీ సీనియర్ నేత జ్యోతుల నెహ్రూ శనివారం ఒక సాధారణ భక్తుని లాగ కళ్యాణకట్ట క్యూలైన్‌లో వెళ్లి తలనీలాలు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు.ఆ తరువాత జ్యోతుల నెహ్రూ తిరుమలలోని పి . ఏ.సి -1 వసతి సముదాయాన్ని సందర్శించి, భక్తుల అందుతున్న సదుపాయాలపై సమీక్ష నిర్వహించారు. శుభ్రత, నీటి సదు-పాయం, భద్రత వంటి అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. .ఈ నేపథ్యంలో టీడీపీకి చెందిన ప్రముఖ నాయకుడు తిరుమలలో కీలక వ్యక్తిగా గుర్తింపు పొందిన పవన్ కుమార్ అలియాస్ పాండు, జ్యోతుల నెహ్రూ పర్యటన కార్యక్రమంలో అన్ని తానై చూసుకోవడంతో తిరుపతి రాజకీయాలలో హాట్ టాపిక్ గా మారింది.

# ఇంటర్ పరీక్షల్లో మజ్జిలపేట విద్యార్థుల ప్రతిభ

### శుభాకాంక్షలు తెలిపిన వావులపల్లి వెంకట సత్యన్నారాయణ , గ్రామస్తులు





**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** ఇంటర్ బోర్డు వెల్లడించిన ఇంటర్ పరీక్షా ఫలితాల్లో పొందూరు మండలం మజ్జిలపేట గ్రామానికి చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పొందూరు మండలం వావిలపల్లిపేట ఏపి మోడల్ కాలేజీ లో బై.పి.సి ద్వితీయ సంవత్సరం చదువుతున్న గురుగు బెల్లి దేవి 1000 మార్కులు గాను 969 ,శ్రీకాకుళం కళాశాలలో చదువుతున్న గురుగుబెల్లి జై ప్రకాష్ 1000 మార్కులు గాను 974 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా మజ్జిల పేట పాఠశాలలో 8వ తరగతి వరకు చదువుకున్న తమ విద్యార్థులు ఇంతటి ఘన విజయం సాధించడం తో మజ్జిలపేట ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వావిలపల్లి వెంకట సత్యన్నారాయణ ,సిబ్బంది గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ లో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరం చేరుకోవాలన్నారు.

## అమోనియా లీక్.. పలువురు కార్మికులకు అస్వస్థత



**నెల్లూరు, ఏప్రిల్ 12 :** జిల్లాలో అమోనియా లీక్ ఘటన కలకలం సృష్టించింది. టీపీ గూడూరు మండలం అనంతపురం గ్రామంలో అమోనియా లీకైంది. వాటర్‌బేస్ కంపెనీలో అమోనియా గ్యాస్ లీక్ కావడంతో.. ఊపిరాడక కార్మికులు హుటాహుటిన పరుగులు తీశారు. ఈ ఘటనలో 10 మంది కార్మికులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. అనంతపురం చుట్టుపక్కల గ్రామాలకు సైతం అమోనియా గ్యాస్ భారీగా వ్యాపించింది. అమోనియా గ్యాస్ లీక్‌తో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ముందు జాగ్రత్తగా అందరూ మాస్కులు ధరించారు. జనాలు ఇళ్లలోనే ఉండి తలుపులు, కిటికీలు వేసుకున్నారు. ఈ ఘటనపై మరింత సమాచారం తెలియాల్సి ఉంది.



## గొర్లె సూర్యారావు కుటుంబానికి పరామర్శ

### పరామర్శించిన చీపురుపల్లి జెడ్పీటీసీ అలిరెడ్డి

**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు పంచాయతీ ఎస్టీ కాలనీకు చెందిన ఉత్తరాంధ్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు గొర్లె సూర్యారావు తండ్రి గొర్లె లక్ష్మణ రావు ఇటీవల ఆనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలిసిన చీపురుపల్లి జెడ్పీటీసీ అలిరెడ్డి శ్రీను సూర్యారావు కుటుంబాన్ని కలిసి పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు టీడిపి నాయకులు అనకాపల్లి గోపి ,పకీర్, వాండ్రంగి సర్పంచ్ సాకేటి నాగరాజు , ఉన్నారు




## నాటు సారాపై అవగాహన

**బాపట్ల, ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) :** నవోదయం 2.%ా% కార్యక్రమంలో భాగంగా నాటు సారా పై బేతపూడి గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఒంగోలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ కె. విజయ, ఒంగోలు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరిండెంట్ ఏ .జనార్ధన రావు, బాపట్ల అసిస్టెంట్ ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ సూపరిండెంట్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బాపట్ల ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల బేతపూడి గ్రామం లో నాటు సారాయి గురించి గ్రామ ప్రజలతో అవగాహన కార్యక్రమం మరియు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బాపట్ల ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి గీతిక, సబ్ ఇన్స్పెక్టర్లు ప్రభుదాస్, మౌనిక మరియు సిబ్బంది పాల్గొన్నారు.



## ఆంధ్రా భద్రాద్రి క్షేత్ర నిర్మాణానికి విరాళమిచ్చిన వెదురుపాక అప్పన్నబాబు కుటుంబ సభ్యులు

**ప్రత్తిపాడు, ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్) :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో జాతీయ రహదారిని ఆనుకుని వివేకానందుని విగ్రహం సమీపంలో దాతల సహకారంతో నూతనంగా నిర్మాణమవుతున్న ఆంధ్రా భద్రాద్రి శ్రీరామనామ క్షేత్ర నిర్మాణానికి ప్రత్తిపాడు గ్రామానికి చెందిన వెదు-రుపాక అప్పన్నబాబు కుటుంబ సభ్యులు నల్లమిల్లి చెంచు అబ్బాయి,సుబ్బలక్ష్మి దంపతులు 5116 రూపాయలు,కేశనకుర్తి వెంకటేశ్వరరావు,వెంకటలక్ష్మి దంపతులు 5116 రూపాయలు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులైన పత్రి రమణ,పచ్చారి సూర్యప్రసాద్,నేతి శ్రీనివాసరావులకి అందచేసారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు అప్పన్నబాబుని శాలువా కప్పి సన్మానం చేసారు. ఈ సందర్భంగా పత్రి రమణ మాట్లాడుతూ క్షేత్ర నిర్మాణానికి తమ వంతు సహకారం అందించిన వెదురుపాక అప్పన్న బాబు కుటుంబ సభ్యులని అభినందిస్తూ ఆంధ్రా భద్రాద్రి క్షేత్ర నిర్మాణంలో ప్రతి ఒక్కరూ విరాళాలు ఇచ్చి ఆలయ నిర్మాణంలో భాగస్వాములై రాములోరి కృపా కటాక్షాలకు పాత్రులవ్వాలని కోరారు. వెదురుపాక అప్పన్న బాబు మాట్లాడుతూ తమ ప్రత్తిపాడు గ్రామంలో ఆహ్లాదకర వాతావరణంలో నిర్మితమవుతున్న ఆంధ్రా భద్రాద్రి క్షేత్ర నిర్మాణంలో పాలుపంచుకోవడం తమ అదృష్టంగా భావిస్తున్నామని,ఈ క్షేత్ర నిర్మాణానికి తమ వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సిరిపిరెడ్డి సూర్యనారాయణ, సైతన శ్రీను తదితరులు పాల్గొన్నారు.




## గ్రామ సేవకుల సమస్యలు పరిష్కరించాలి: సీఐటీయూ

**పోడూరు, ఏప్రిల్11 ,ప్రజాజ్యోతి న్యూస్ :** గ్రామ సేవకుల సమస్యలుపరిష్కరించాలని సిఐటియు జిల్లా కౌన్సిల్ సభ్యులు పిల్లి ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా పోడూరు మండలం తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించి, తాహసీల్దార్ సయ్యద్ మౌలానా పాజిల్‌కి వినతిపత్రంఅందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ నిబంధన లకు విరుద్ధంగా గ్రామ సేవకులను రాత్రిడ్యూటీలు , ఇసుక రైస్ మిల్లులు వద్ద డ్యూటీలు వెంటనే ఆపాలన్నారు. తెలంగాణా రాష్ట్రంలో ఇస్తున్నట్లు నామినీలతో సహా వి ఆర్ ఏ లందరికి ఫేస్కెలుజీతాలు ఇవ్వాలన్నారు. డిఏ ను జీతంలో కలపాలి వైసీపీ పాలనలో రికవరీ చేసిన డి ఏ నగదును తిరిగి చెలించాలన్నారు.విఆర్ ల కు ప్రమోషన్ అమలు చెయ్యాలన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అటెండర్, వాచ్మెన్,రికార్డ్ ఆసిటెంటు, డ్రైవర్ కాళీ పోస్టులు, అర్హులైన విఆర్ ఏ తో భర్తీ చెయ్యాలన్నారు. నామినీలను వి ఆర్‌ఏ లు గా గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఏ లు బెల్లాని ప్రకాశ రావు, నాయకులు బూరాబత్తుల వెంకట్రావు,బొంతు శ్రీను, ఎన్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి ర్యాంకులు సాధించిన అక్కాచెల్లెళ్లు




**ప్రజాజ్యోతి న్యూస్/ జీలుగుమిల్లి :** మార్చి 2025 లో జరిగిన ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల జీలుగుమిల్లి లో గెడ్డం పండు కుమార్తెలైన ఇద్దరు అక్కా చెల్లెళ్ళు మొదటి ర్యాంకులు సాధించారు. మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలలో కళాశాల చెందిన గడ్డం పూజ హెచ్ఈసి గ్రూపులో 449/500 సాధించింది. కళాశాల ప్రథమ స్థానంలో నిలిచింది. అదేవిధంగా ఇంటర్ రెండవ సంవత్సరములో అదే కుటుంబానికి చెందిన గడ్డం తులసి హెచ్ఈసి గ్రూపు నుండి 825/1000 మార్కులు సాధించిందినీ కళాశాల ప్రిన్సిపాల్ బోరుగం సతీష్ కుమార్ అన్నారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ గ్రూపు నుండి మొడియం చైతన్య 375/470 సాధించి కళాశాల రెండవ స్థానంలో నిలిచాడు. ఇంటర్ రెండో సంవత్సరంలో జుత్తిక హరిణి హెచ్ఈసి గ్రూపు నుండి కళాశాల రెండవ స్థానంలో నిలిచింది . మొత్తంగా కళాశాల ఫలితాలు ఇంటర్ మొదటి సంవత్సరం 48% రెండో సంవత్సరంలో 73% ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ బొరగం సతీష్ కుమార్ ఇంటర్ మొదటి సంవత్సరం రెండవ సంవత్సరం లలో మొదటి స్థానాలను పొందిన గడ్డం పూజ మరియు గడ్డం తులసి అలాగే ముడియం చైతన్య జుత్తిక హరిణి లను , మరియు ఉత్తీర్ణులైన విద్యార్థులను అభినందించారు. కళాశాల అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు .

## చాత్రావాస కార్యాలయాన్ని ప్రారంభించిన వెంకయ్య నాయుడు



**ఏప్రిల్ 12,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలోని విద్యార్థుల విభిన్న సౌకర్యాల నిమిత్తం నిర్మించినటువంటి చాత్రావాస కార్యాలయాన్ని శనివారం పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు , వైస్ ఛాన్సలర్ ప్రొ.జిఎస్సార్ కృష్ణ మూర్తి సంయుక్తంగా ప్రారంభించారు. అనంతరం ఆయన హాస్టల్ ఆఫీస్ ని పరిశీలించారు. ప్రత్యేకించి అక్కడ ప్రదర్శించిన సాంస్క్రిట్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్ని తిలకించి హర్షాన్ని వ్యక్తం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో విశ్వవిద్యాలయ చీఫ్ వార్డెన్ ప్రొ.పి. వెంకట్రావు ముఖ్య అతిథులకు విచ్చేసినటువంటి పెద్దలకు స్వాగతాన్ని పలికి, పుష్పగుచ్ఛంతో ఆహ్వానించడం జరిగినది. అనంతరం విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొ.జి.ఎస్.ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠంగా ఉన్న ఈ విద్యాపీఠం జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంగా పార్లమెంట్లో బిల్లు పాస్ అయ్యే సందర్భంలో రాజ్యసభకు అతిథులు వెంకయ్య నాయుడు చైర్మన్గా వ్యవహరించడం ఎంతో భాగ్యమని అన్నారు. ఆయనకు భారతీయ భాషలపట్ల, ప్రత్యేకించి తెలుగు భాష పట్ల ఉన్నటువంటి ప్రేమ, గౌరవం ఎంతో ప్రశంసనీయమని అని చెప్పారు. విశ్వవిద్యాలయం తరఫున వారికి ధన్యవాదాలు తెలిపారు. ఎన్నోసార్లు ప్రయత్నించినప్పటికీ కూడా ఈరోజు ఆయన ఇక్కడికి విచ్చేసి, ఈ భవనాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు.విచ్చేసినటువంటి ఉపరాష్ట్రపతికి హృదయపూర్వక ధన్యవాదములు తెలియజేశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ అభివృద్ధి కృషి చేసినటు వంటి అధ్యాపకలు, అధికారులు, కర్మచారులను అభినందించడం జరిగినది. అనంతరం ముఖ్య అతిథులు పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు మాట్లాడుతూ సంస్కృత భాషలో ఎన్నో గొప్ప గొప్ప గ్రంథాలు నిక్షిప్తమై ఉన్నాయని, అందులో చెప్పబడినటువంటి జ్ఞానం ఈరోజు మనమందరం జీవిస్తున్న విధానానికి మార్గదర్శనం అని అన్నారు. ఇక్కడ ఉన్నటువంటి సంస్కృత గ్రంథాలు ఏవైతే ఉన్నాయో వాటిని సంస్కృత భాష నుండి తెలుగు ఇతర ప్రాంతీయ భాషల్లోకి చక్కగా తర్జుమా చేసినట్లయితే ఆ గ్రంథాల్లో ఉన్నటువంటి జ్ఞానాన్ని విద్యార్థులు ప్రజలు చదువుకొని, తెలుసుకొని ఉత్తమ నాగరికలుగా జీవించడానికి ఎంతో దోహదపడుతుందని వివరించారు. ఇతర భాషల్లో అనువదించిడానికి కేంద్రం నుంచి కూడా సహాయ సహకారాలు తీసుకుంటామని ఆయన హామీ ఇవ్వడం జరిగింది. భవన ప్రారంభ సందర్భంగా అందరికీ శుభాకాంక్షలు తెలియజేసి, సంస్కృత భాషాభివృద్ధికి, తెలుగు భాషాభివృద్ధికి ఎల్లప్పుడూ కృతనిశ్చయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. అనంతరం అకాడమిక్ డీన్ ప్రొ.రజినీకాంత్ శుక్ల విచ్చేసినటువంటి అతిథులకు, ప్రత్యేకించి ముఖ్య అతిథులు వెంకయ్య నాయుడు, కులపతులకు, ఇతర విద్యాలయ అధికారులకు వందన సమర్పణం చేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ .కె.వెంకటనారాయణ రావు, ఫినాన్స్ ఆఫీసర్ ప్రొ.రాధా గోవింద త్రిపాఠి, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్ ప్రొ.ఎస్.దక్షిణామూర్తి శర్మ, విశ్వవిద్యాలయ ప్రొక్టర్ ప్రొ.సి.రంగనాథన్, వేద వేదాంగ డీన్ ప్రొ.కృష్ణేశ్వర ఝా, సాహిత్య సంస్కృత డీన్ ప్రొ.సత్యనారాయణాచార్య, పి.ఆర్.ఓ. ప్రొ.వి.రమేష్ బాబు, ఎ.పి.ఆర్.ఓ. డా.కనపాల కుమార్, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.ఎ.చందూలాల్, విశ్వవిద్యాలయ ఇంజనీర్ టి.భరణి కుమార్ విశ్వవిద్యాలయంలోని విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేసారు.

## పెంచిన గ్యాస్ ధరలను ఉపసంహరించు కోవాలి : సిపిఎం




**పోడూరు, ఏప్రిల్11 ప్రజాజ్యోతి న్యూస్ :** కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం వంట గ్యాస్హొపెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ చేసిననిర్ణయాన్ని తక్షణమేవెనక్కితీసుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ కాకర వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ ధరలను సిలండర్ రూ50 పెంచడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో గురువారం పోడూరు కొత్తపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి ధర్నా నిర్వహించి నిరసనలు తెలిపారు.ఈ సందర్భంగా కాకర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ నాయకత్వంలోని బీజీపీ ప్రభుత్వం అన్నింట ధరలనుపెంచి ప్రజలజీవితాలను నట్టేట ముంచేస్తుందని విమర్శించారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గిన దీనికి అనుగుణంగా పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించి ప్రజలపై భారాలను తగ్గించవలసిన కేంద్ర ప్రభుత్వం సామాన్య పేద ప్రజలపై ఈ రకమైన భారలవెయ్యడందారుణమని మండిపడ్డారు. ప్రభుత్వం తక్షణమే పెంచిన గ్యాస్, ఎక్సైజ్ సుంకం రద్దు చేయాలన్నారు. భారీగా పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ మండలశాఖ కార్యదర్శి బూరాబత్తుల వెంకట్రావు, పిల్లి ప్రసాద్, నమ్మితి శాంసన్, బండిశ్రీను, బ్రహం, నందిశ్వరుడు, నాగమణి, దుర్గాభవాని, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

## గొడవలకు తావు లేకుండా అంబేద్కర్ జయంతిని జరుపుకోవాలి



**తూర్పుగోదావరి జిల్లా , తాళ్లపూడి మండలం, ఏప్రిల్12, ప్రజాజ్యోతి న్యూస్ :** ఈ నెల 14 న జరగబోవు అంబేద్కర్ జయంతి శాంతి యుతంగా జరుపుకోవాలని తాళ్లపూడి ఎస్సై టి. రామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు సంవత్సరాల క్రితం జరిగిన గొడవల దృష్ట్యా మండలంలో ఎటువంటి గొడవలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా తూర్పు గోదావరి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాళ్లపూడి మండల పరిధిలో ప్రత్యేక బృందాన్ని పంపించినట్లు తెలిపారు. ఒక సీఐ ఒక ఎస్సై మరియు స్పెషల్ పార్టీ కానిస్టేబుల్స్ ఆరుగురిని కేటాయించారన్నారు. అంబేద్కర్ జయంతి ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆ మహాత్ముని ఆశయాలకు ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాలని డీ జే లు పెట్టీ ధ్వని కాలుష్యం మరియు మద్యం వంటి అసాంఘిక కార్యక్రమాలకు తావు ఇవ్వకుండా ఆడవారికి ముగ్గుల పోటీలు, విద్యార్థులకు వ్యాస చరచన పోటీలు, మరియు పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు ఇస్తూ అంబేద్కర్ జయంతి ని ఆనంద వాతావరణంలో ఎటువంటి కుల, మత భేదాలు లేకుండా జరుపుకోవాలని మండల ప్రజలకు సూచించారు



## గ్రామస్తుల శ్రమదానం

- అమ్మవారి పండుగ నేపథ్యంలో రహదారి పనులు
- పైడితల్లి అమ్మవారి ప్రతిరూపంగా గుండం ఏర్పాటు
- గుండం కు వెళ్ళే రహదారని చదును చేసిన గ్రామస్తులు

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు పైడితల్లి అమ్మవారి పండుగ సందర్భంగా పొందూరు పంచాయతీ పరిధిలో గల ఎస్టీ కాలనీ వాసులు శ్రమదానం చేశారు. గతంలో పైడితల్లి అమ్మవారి ప్రతిరూపంగా గ్రామ పెద్దల సహకారంతో గ్రామస్తులంతా కలిసి గుండాలుగా ఏర్పాటు చేసి అమ్మవారి ప్రతిమను అందులో ప్రతిష్టించారు. ఈ మేరకు ప్రతీ మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తూ కొలుచుకుంటున్నారు. అమ్మవారి పండుగ నేపథ్యంలో గ్రామస్తులంతా కలిసి గుండానికి చేరుకునే రహదారికి చదును చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్, టిడిపి మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి,ఈ. ఓ మోహన్ బాబు ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.



## సనపల తిరుపతి రావు కుటుంబానికి పరామర్శ

### పరామర్శించిన నియోజకవర్గ స్వతంత్ర్య అభ్యర్థి సువ్వారి గాంధీ

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** రిటైర్డు డి.ఎం.హెచ్. ఓ డాక్టర్ సనపల తిరుపతి రావు కుటుంబాన్ని ఆమదాలవలస నియోజకవర్గ స్వతంత్ర్య అభ్యర్థి సువ్వారి గాంధీ శనివారం నాడు పాత బస్టాండ్ సమీపంలో తన స్వగృహం వద్ద పరామర్శించారు. తిరుపతి రావు అత్త మొదలవలస కృష్ణవేణి ఆనారోగ్యంతో మృతి చెందడం తో సువ్వారీ ఆయన కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పొందూరు పట్టణానికి చెందిన ఉంద్రాళ్ళ కిషోర్ ఇటీవల ప్రమాదవశాత్తు మరణించడం తో సువ్వారి గాంధీ వారి కుటుంబాన్ని పరామర్శించారు. గాంధీ తో పాటు గురుగుబెల్లి హరనాథ్ , భీం రాజు , శ్రీనివాస్ ,పైడి విజయ్ ఉన్నారు . మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం జి సిగడాం మండలం ధవళ పేట మాజీ సర్పంచ్ కంచరాన సూరన్న నాయుడు కిషోర్ కుటుంబాన్ని పరామర్శించారు.



## 33వ వార్డులో టిడిపి సభ్యత్వకార్డులు పంపిణీ

**గుంతకల్లు ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి):** గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మరియు గుమ్మనూరు శ్రీనివాసులు మరియు గుంతకల్లు మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి ఆదేశాల మేరకు శనివారం నగర డోణ వీరేష్ పట్టణంలోని 33 వ వార్డు నందు తెలుగుదేశం పార్టీ సభ్యత్వం కార్డులు ఇంటింటికి తిరిగి పంపిణీ జరిగినది. ఈ సందర్భంగా నగర డోణ విరేష్ మాట్లాడుతూ పేద ప్రజల అంశాలను నెరవేర్చేందుకు ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ సభ్యత్వం అంటే ఒక గౌరవమని,రెండేళ్ల కాల పరిమితితో కూడిన టిడిపి సభ్యత్వ కార్డులను తీసుకున్న వారికి అందజేయ డం జరుగుతుందని,దీనివల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో 33 వ వార్డు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొనడం జరిగినది.



## తుగ్గలి వాల్మీకి గుడిలో ప్రత్యేక పూజలు

### మాజీ స్కూల్ చైర్మన్ ఈశ్వరప్ప దంపతులు

**ప్రజా జ్యోతి తుగ్గలి :** తుగ్గలి గ్రామంలో వాల్మీకి మహర్షి కి ఐదు రోజులు పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక తుగ్గలి వాల్మీకి ఆలయంలో మాజీ స్కూల్ చైర్మన్ ఈశ్వరప్ప దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి. వేటగాడిగా ఉన్న వాల్మీకి పరిణితి చెంది రామాయణం రచించి మహర్షి అయ్యారని తెలిపారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా చేసుకుని ప్రతిఒక్కరూ ముందుకెళ్లాలని సూచించారు.వాల్మీకులు పాల్గొని వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి సంబరాలు చేసుకున్నారు





## వైభవంగా శ్రీ కోదండరాముని రథోత్సవం

**ఏప్రిల్ 12,(ప్రజాజ్యోతి),తిరుపతి జిల్లా ప్రతినిధి :** ఒంటిమిట్ట శ్రీకోదండరామస్వామి శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం రథోత్సవం ప్రారంభమైంది.శ్రీ సీతాలక్ష్మణ సమేత కోదండరాములవారు రథాన్ని అధిష్టించి గ్రామవీధుల్లో విహరించారు. భజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలు చేస్తుండగా భక్తులు రథాన్ని లాగారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు అందించారు. ఆత్మ రథికుడు, శరీరమే రథం, బుద్ధి సారథి, మనస్సు పగ్గం, ఇంద్రియాలే గుర్రాలు, విషయాలే వీధులు. ఈ రీతిలో శరీరాన్ని రథంతో పోల్చడంతో స్థూల శరీరం వేరని, ఆత్మ అందుకు భిన్నమనే ఆత్మానాత్మ వివేకం కలుగుతుంది. రథోత్సవంలో ముఖ్యంగా కలిగే తత్త్వజ్ఞానమిదే. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి వీరబ్రహ్మం, డెప్యూటీ ఈవో నటేష్ బాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ నవీన్, ఇంజినీరింగ్ అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## కేజీబీవీలో ఫస్ట్ ఇయర్ 93 శాతం, సెకండ ఇయర్ 82 శాతం ఉత్తీర్ణత

- ఫస్ట్ ఇయర్ లో 432 మార్కులు సాధించిన హర్షిత
- సెకండ్ ఇయర్ లో 939 మార్కులు సాధించిన భారతి
- ప్రిన్సిపాల్ వి. షాహీన్

**ప్రజా జ్యోతి తుగ్గలి :** మండల కేంద్రమైన తుగ్గలి లోనే కేజీబీవీ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థినిలు 93 శాతం, రెండవ సంవత్సరం విద్యార్థినిలు 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ వి .షాహీన్ తెలిపారు. శనివారం ఆమె కళాశాలలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో తమ కళాశాల నందు మొదటి సంవత్సరం విద్యార్థినిలు 30 మంది పరీక్షలు రాయగా 28 మంది విద్యార్థినిలు ఉత్తీర్ణత సాధించినట్లు, అలాగే రెండవ సంవత్సరం 28 మంది విద్యార్థులు పరీక్షలు రాయిగా రాయగా 23 మంది విద్యార్థినిలు ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె తెలిపారు. మొదటి సంవత్సరం లో ఎం హర్షిత 432, సంకీర్తన 429, దివ్య 420 మార్కులు సాధించడం జరిగిందన్నారు. అలాగే రెండవ సంవత్సరం లో భారతి 939, శివ గాయత్రి 938, సౌమ్య 930 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.షాహీన్ తెలిపారు.



## జనసేన నాయకులు మురళి సహకారంతో మజ్జిగ వితరణ

**బద్వేల్ ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి న్యూస్) :** మండుతున్న వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని శనివారం మధ్యాహ్నం అన్నా క్యాంటీన్ వద్ద మంచినీటి చలివేంద్రం ఆవరణంలో సుమారు 300 మందికి పైగా మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని జనసేన సీనియర్ నాయకులు తుడిమెల్ల మురళీకృష్ణ వారి సహకారంతో పలువురికి సీనియర్ న్యాయవాది పి,వి,ఎన్ ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కే,వీ సుబ్బారావు, జనసేన నాయకులు సురేంద్ర, భాస్కర్, జనార్ధన్ రెడ్డి తో పాటు పలువురి చేతుల మీదుగా మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మజ్జిగ వితరణకు సహకరించిన మురళీకృష్ణ గారికి శాలువాతో సత్కరించి వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వేసవికాలంలో పలువురు దాహార్తి తీర్చుట కొరకు చలివేంద్రం ద్వారా మంచినీటిని అందించడమే కాకుండా ప్రతిరోజు దాతల సహకారంతో మజ్జిగ వితరణ నిర్వహించడం సంతోషకరమని పలువురు సంతృప్తి వ్యక్తం చేస్తూ మురళీకృష్ణను అభినందించారు.

# రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

**బద్వేల్ ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి న్యూస్) :** శనివారం నాడు స్థానిక సుందరయ్య భవనం నందు ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 ,21 తేదీలలో ఎన్టీఆర్ జిల్లా, కొండపల్లి లో జరిగే ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం 7వ రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ పట్టణ కన్వీనర్ కె. శ్రీనివాసులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో లక్షలాదిమంది రజక వృత్తిదారులుగా నేటికీ రజక వృత్తియే జీవనాధారంగా జీవిస్తున్నారు. స్వతంత్రం సిద్ధించి 78 వసంతాలు పూర్తి అయిన నేటికీ సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా రజకులు తీవ్ర ఆర్థిక సమస్యలు ఎదుర్కొనుచున్నారని, ఇప్పటికీ గ్రామాలలో రజకులపై పెత్తందారీతనం కులవివక్ష కొనసాగుతున్నదని, శ్రమకు తగిన వేతనం ఇవ్వమని ప్రశ్నిస్తే నేరంగా భావించి గ్రామ సాంఘిక బహిష్కరణలు జరుపుతున్నారని, గ్రామాలలో రజక వృత్తి బలహీనపడటం వలన రజకులు పట్టణ ప్రాంత అపార్ట్మెంట్ వాచ్మెన్- కం- ఇస్త్రీదారులుగా వలస జీవనం కొనసాగిస్తున్నారని, పట్టణాలలో రజక వృత్తిని బడా పెట్టుబడురుదారులు కబళిస్తూ రజకులను వారి వద్ద రోజు కూలీలుగా మార్చి వేస్తున్నారని, అపార్ట్మెంట్ యజమాన్య కమిటీలు కనీస వేతనాలు చెల్లించకుండా శ్రమ దోపిడీ చేస్తున్నారని, రజక మహిళలు బాలికలపై ఆగని అత్యాచారా హత్యలు జరుగుతున్నాయని, వృత్తిలో అభద్రతాభావం వివక్షత, సామాజిక రక్షణ లేక రజకులు మానసిక క్షోభకు గురవుతున్నారని, రజక వృత్తి భద్రత, సామాజిక రక్షణ, రజక అభివృద్ధి- సంక్షేమమే ధ్యేయంగా ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్రవ్యాప్తంగా రజకులను సంఘటిత పరుస్తూ సమస్యలపై సమరశీల పోరాటాలు నిర్వహిస్తున్నదని, వృత్తి చెరువులపై భూమి హక్కులు, గ్రామాలలో శ్రమకు తగిన వేతనం, పట్టణాలలో రజకులకు కనీస వేతన చట్టం అమలు, ఇస్త్రీ రేట్లు పెంపు, ఆధునిక దోబీ ఘాట్ల నిర్మాణం, దోబీ



పోస్టుల భర్తీ, సాంఘిక న్యాయం కొరకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటుకై, భూ పంపిణీ, ఇళ్ల స్థలాలు, రిజర్వేషన్లు, రజక అభివృద్ధి సంక్షేమ కార్పొరేషన్ కు విధివిధానాలు రూపొందించి బడ్జెట్లో కేటాయించిన నిధులు రజక య-ువతి- యువకులకు స్కిల్ డెవలప్మెంట్ ద్వారా ఉపాధి కల్పించాలని, రజక సంక్షేమానికై బడ్జెట్ నిధులను ఖర్చు చేయాలని, లాండ్రీ వృత్తిదారులకు నెలకు 200 యూనిట్లు ఉచిత కరెంటు మంజూరు చేయాలని, 50 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి రజక వృత్తిదారునికి వృద్యాప పించను మంజూరు చేయాలని ఈ మహాసభలలో చర్చించి భవిష్యత్తు కార్యక్రమాన్ని రూపొందించనున్న తరుణంలో ఏప్రిల్ 20,21 తేదీలలో ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి లో జరిగే రాష్ట్ర మహాసభలలో రజక వృత్తిదారులు, కార్మికులు, రజక ఉద్యోగులు, రజక య-ువత ఐక్యంగా పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం పట్టణ అధ్యక్షులు చెప్పలి సుబ్బరాయుడు, పట్టణ నాయకులు ప్రభలవీడు శ్రీనివాసులు, దిరసంత కేశవ, ఏటూరి బాలయ్య, చేతి వృత్తిదారుల సంఘం పట్టణ నాయకులు గంగన పల్లె నాగార్జున,పి.సి.కొండయ్య, పందిళ్ళపల్లె సుబ్బరాయుడు, గంప సుబ్బరాయుడు, తమ్మిశెట్టి పెంచలయ్య, పాతకోట వెంకటేశ్వర్లు, గానుగపెంట వెంకటసుబ్బయ్య, కుంభగిరి రామయ్య, దళాయి రత్నమయ్య,మూర ప్రసాద్, మోక్షమ్మ, కైరోన్ బీ,ఫాతిమా, బాబయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ ఫొటోతో అన్నాచెల్లెళ్ల బురిడీ

## తెలుగు ఎన్ఆర్ఐకి రూ.2.68 కోట్లు టోపీ

**భోపాల్:** పెళ్లి చేసుకోవడానికి మంచి అమ్మాయి కోసం మ్యాట్రీమోనీని ఆశ్రయించిన తెలుగు ఎన్ఆర్ఐకి ఓ అన్నాచెల్లెళ్లు చుక్కలు చూపించారు. నకిలీ ప్రొఫైల్తో పరిచయం చేసుకొని.. పెళ్లి పేరుతో నమ్మించి ఏకంగా రూ.2.83కోట్లకు టోపీ పెట్టారు. చివరకు మోసపోయానని తెలుసుకున్న ఆ యువకుడు స్వదేశానికి వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓ యువకుడు అమెరికాలోని నార్త్ కరోలినాలో గల ప్రముఖ ఐటీ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. 2023లో ఆయనకు మ్యాట్రీమోనీలో మధ్యప్రదేశ్లోని ఇందౌర్కు చెందిన బర్కా జైస్వానీ అనే పేరుతో ఓ అమ్మాయి పరిచయ-ంమైంది. కొంతకాలం మాట్లాడుకున్న తర్వాత వాట్సప్లోనూ టచ్లోకి వచ్చారు. పెళ్లి పేరుతో నమ్మించిన ఆమె యువకుడితో మరింత సాన్నిహిత్యం పెంచుకుంది. ఆ తర్వాత నుంచి ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం, విదేశీయానం కల అని పలు కారణాలు చెప్పి యువకుడి నుంచి డబ్బులు గుంజుకుంది. అలా 2023 ఏప్రిల్ నుంచి గతేడాది జూన్ వరకు విడతలవారీగా రూ.2.68 కోట్ల నగదు తన, బంధువుల ఖాతాలో బదిలీ చేయించుకుంది. ఇటీవల ఆ యువకుడు బర్కాకు వీడియో కాల్ చేశారు. అందులో మాట్లాడిన అమ్మాయి.. మ్యాట్రిమోనీలోని ప్రొఫైల్లో ఉన్న యువతిలా లేకపోవడంతో ఆయనకు అనుమానం వచ్చింది. డబ్బుల విషయం అడగ్గా పొంతన లేని సమాధానం చెబుతూ బర్కా దాటవేస్తూ వచ్చింది. దీంతో ఆ యువకుడు అమెరికా నుంచి ఇందౌర్కు వచ్చి పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు చేపట్టగా అసలు విషయం తెలిసి పోలీసులు అవాక్కయ్యారు. బర్కా అసలు పేరు సిమ్రన్ అని, ఆమెకు అప్పటికే



పెళ్లయిందని తెలిసింది. మ్యాట్రీమోనీలో ఓ మోడల్ ఫొటో పెట్టి తన సోదరుడు విశాల్తో కలిసి ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. యువకుడి నుంచి తీసుకున్న డబ్బుతో అప్పులు తీర్చి, కార్లు కొనుక్కున్నారని తెలిపారు. నిందితులను అరెస్టు చేసి దర్యాప్తు చేపట్టారు.



## రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**పాలకొల్లు.ప్రజాజ్యోతి (కొట్టి రామం) ఏప్రియల్ 12.** ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెనుమదం సాగునీటి సంఘం అధ్యక్షులు దేవరపు దొరబాబు అన్నారు. పోడూరు మండలం పెనుమదం పెదపేటలో గల రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రైతులకు దాన్యం అమ్మిన సొమ్ము చేతికి రావడానికి చాలా సమయం పట్టేదని రైతులకు పెట్టుబడులకు సొమ్ములు లేక ధాన్యం సొమ్ములకు ఎదురు చూడవలసి వచ్చేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతులు ఎదురు చూడనవసరం లేకుండా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్ద అమ్మిన 24 గంటల్లోనే సొమ్ములు రైతుల బ్యాంకు ఖాతాలో పడేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తగు చర్యలు తీసుకోవడంతో రైతులు ఎంతో ఆనందం చెందుతున్నారన్నారు.పాలకొల్లు నియోజకవర్గంలో మంత్రి నిమ్మల రామానాయుడు దాళ్వా పంటకు రైతులకి సాగునీటి సమస్యలు లేకుండా శివారు ప్రాంతాలకు సైతం సాగు నీరు సక్రమంగా అందేలా చూడటంతో రైతులకు సాగునీటి ఇబ్బందులు ఏమీ ఎదురుకాలేదన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కానేటి బాబురావు ఎంపీటీసీ స్థానిక నాయకులు శ్రీధర్ మానేపల్లి శ్రీధర్ రెవెన్యూ సెక్టార్ కందుల రాంబాబు స్థానిక నాయకులు సత్యనారాయణ బూస్ట్ పాముల నాగరాజు రైతు సేవా కేంద్రం సిబ్బంది షాలిని తదితరులు పాల్గొన్నారు.




## అంబేడ్కర్ను గౌరవించిన ఘనత బిజెపిదే

- 60 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదు
- బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి

**విజయవాడ, ఏప్రిల్ 12 :** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ను గౌరవించింది భారతీయ జనతా పార్టీ మాత్రమే అని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. అంబేద్కర్కు భారతరత్న ఇచ్చి పార్లమెంట్లో ఆయన చిత్రపటం పెట్టాం అని, 60 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. 106 సార్లు సవరణ జరిగిన రాజ్యాంగంలో అధిక శాతం కాంగ్రెస్ స్వలాభం కోసం సవరణలు జరిగాయని మండిపడ్డారు. ప్రధాని నరేంద్ర మోడీ కాలంలో జరిగిన 22 సవరణలు సామాజిక న్యాయం దృష్టిలో పెట్టు-కుని చేసినవే అని పురంధేశ్వరి పేర్కొన్నారు. ఏపీ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకల నిర్వహణపై రాష్ట్రస్థాయి కార్యాచరణ సమావేశానికి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరితో పాటు జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ హాజరయ్యారు. ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ... 'డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమసమాజ స్థాపనకు కృషి చేశారు. 2014 ఎన్నికల్లో విపక్షాలు మా పట్ల దుష్ప్రచారం చేశాయి. అంబేద్కర్ను గౌరవించింది బీజేపీ మాత్రమే. అంబేద్కర్కు భారతరత్న ఇచ్చి పార్లమెంట్లో ఆయన చిత్రపటం పెట్టాం. 60 సంవత్సరాలు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఏనాడూ పట్టించుకోలేదు. 106 సార్లు సవరణ జరిగిన రాజ్యాంగంలో అధిక శాతం కాంగ్రెస్ స్వలాభం కోసం సవరణలు జరిగాయి. నరేంద్ర మోడీ కాలంలో జరిగిన 22 సవరణలు సామాజిక న్యాయం దృష్టిలో పెట్టు-కుని చేసినవే. డీకే శివకుమార్ ముస్లిం మైనారిటీ-లకు 4??? అదనపు రిజర్వేషన్ ఇవ్వడానికి రాజ్యాంగాన్ని మార్చేస్తాం అన్నారు. శివకుమార్కు రాజ్యాంగం పట్ల ఉన్న గౌరవం ఇదేనా.. మీకోసం మార్చేస్తారా?' అని మండిపడ్డారు. అంబేద్కర్ జయంతి వేడుకలు రేపటి నుంచి 25వ తేదీ వరకూ జరపాలని నిర్ణయం తీసుకున్నాం. అంబేద్కర్ ఆశయాలను గ్రామగ్రామాలకూ తీసుకెళ్ళాలని నిర్ణయించారు. బీజేపీ వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తారనే కాంగ్రెస్ దుష్ప్రచారం వల్ల వచ్చిన అనుమానాలు లేకుండా చేయడానికే ఈ వేడుకలు. అంబేద్కర్ను ఓడించాలని నెహ్రూ అప్పట్లో ఆదేశించారు.

## ధరల పెంపుతో సామాన్య ప్రజల

# నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం

**బద్వేల్ ఏప్రిల్ 12 (ప్రజా జ్యోతి న్యూస్) :** ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు తోడు గ్యాస్ సిలెండర్ రేట్లు పెంచడం అమానుషమని, ధరల పెంపుతో పేద సామాన్య ప్రజల నడ్డి విరుస్తున్న కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి బందెల ఓబయ్య పిలుపునిచ్చారు. శనివారం ఉదయం బద్వేల్ పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తలతో మన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం తన ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిత్యావసర వస్తువులు ధరలను తగ్గించి సామాన్యులకు అందుబాటులోకి తెస్తామని వాగ్దానం ఇచ్చి నేడు మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా నేడు గ్యాస్ సిలిండర్ పై 50 రూపాయలు పెంచి సామాన్యుడి వంటింట్లో గ్యాస్ ధరల మంటలు పుట్టిస్తున్నారని వారు విమర్శించారు. గత కొన్ని రోజులుగా వాణిజ్య సిలెండర్ ధరలను పెంచుతూ వస్తున్న ప్రభుత్వం తాజాగా గృహ వినియోగ వంట గ్యాస్ ధరను కేంద్రం రూ 50 పెంచి పేద,సామాన్య ప్రజల నడ్డి విరచడం దుర్మార్గమని, ఉజ్వల్ యోజన పథకం క్రింద అందచేసే సిలెండర్ పై కూడా రూ 50 భారాన్ని మోపడం సామాన్య, మధ్య తరగతి ప్రజలకు గ్యాస్ దూరం చేయడమేనని, ఈ పెంపుతో 14.2 కేజీల



ఎల్ పి జి గ్యాస్ సిలెండర్ ధర రూ 853 నుంచి రూ 903కు చేరిందని, ఇప్పటికే కూరగాయల ధరల నుంచి కిరాణా సరుకుల వరకు ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితిని ఎదుర్కొంటుంటే ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలను అరికట్టి సామాన్య ప్రజలకు అందుబాటులో తేకుండా మరింత భారాలను మోపడం దుర్మార్గమని వారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్లో భాగంగా ప్రవేశపెట్టిన దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు చాలామందికి అందడం లేదన్నారు. ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందజేయనున్నట్టు ప్రకటించారని, ముందుగా వినియోగదారులు సిలిండర్ ధర ఏజెన్సీలకు చెల్లించాలని, రెండు రోజుల్లో ఆ డబ్బులు మొత్తం సబ్సిడీ కింద వినియోగదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారని,కానీ నేటికీ తొలివిడత కింద ఇప్పటివరకూ ముప్పై, నలభై శాతం మందికి సిలిండర్ రాయితీ డబ్బులు వారి ఖాతాకు జమ కాలేదని దీనికి అనేక కారణాలు చెప్తున్నారని ఎవరిని అడగాలో తెలియని పరిస్థితులు లబ్ధిదారులు అయోమయంలో ఉన్నారని ఇది ప్రభుత్వ లోపం కాదా అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం తాము ఇచ్చిన హామీల ప్రకారం తక్షణమే నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేసి పెంచిన గ్యాస్ ధరలను వెంటనే ఉపసంహరించుకొని, లోపాలను సవరించి మొదటి ఉచిత సిలిండర్ డబ్బులు జమ కాని వినియోగదారులకు డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకొని ప్రజలకు ఇచ్చిన హామీల నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం వైఫల్యాలపై సిపిఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ చేపట్టబోవు ప్రజా ఉద్యమాలలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చంద్రమోహన్ రాజు, జకరయ్య మరియు నియోజకవర్గ నాయకులు సంజీవ రాయుడు,విజయ రావు, కే బాబు, చంద్రపాల్, జైపాల్, రమణ తదితరులు పాల్గొన్నారు.

# రెండు అరచేతులు కాసేపు రుద్దితే

అప్పుడప్పుడు చాలా మంది రెండు అరచేతులు రుద్దుతుంటారు. రెండు చేతుల అరచేతులను రుద్దడం ముద్రా దోషమని చాలామంది నమ్ముతారు. అలాగే చాలా మందికి తరచుగా చెమటతో చేతులు తడిసిపోతుంటాయి.ముఖ్యంగా చలికాలంలో ఈ సమస్య ఎక్కువగా సంభవిస్తుంది. ఇలాంటప్పుడు కూడా చేతులు మళ్లీ మళ్లీ రుద్దుంటారు. చాలా మంది ఎగ్జామ్ హాల్‌లో కూర్చున్నప్పుడు లేదా ఇంటర్వ్యూ ఇస్తున్నప్పుడు టేబుల్ కింద పదేపదే చేతులు రుద్దుతుంటారు. పరీక్షలు లేదా ఇంటర్వ్యూల ఒత్తిడి నుంచి బయటపడటానికి ఇలా చేస్తే ప్రయోజనం ఉంటుంది. భయం, మానసిక ఆందోళన, చంచలత్వం సంభవించినప్పుడు కూడా దీన్ని చేయవచ్చు.ఈ విధానం మనస్సుకు సానుకూల శక్తిని ప్రసారం చేయడానికి ఉద్దీపనగా పనిచేస్తుంది. ఈ ముద్ర మానసిక స్థితిని నిర్వహించడానికి, మనస్సును శాంతపరచడానికి కూడా సహాయపడుతుంది. రెండు చేతుల అరచేతులను రుద్దడం వల్ల కలిగే ప్రయోజనాలు చాలానే ఉన్నాయి. రెండు చేతుల అరచేతులను రుద్దడం వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. అప్పుడు శక్తి ప్రసారం అవుతుంది. మంచి మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఇది సహాయపడుతుంది. మీరు ఎప్పుడైనా ఏకాగ్రత లోపిస్తే లేదా అనిశ్చితితో బాధపడుతుంటే, ఈ విధానాన్ని ఉపయోగించవచ్చు. చేతులు రుద్దడం కూడా నాడీ ఉద్రిక్తతను అదుపులో ఉంచడంలో సహాయపడుతుంది. మీరు ఏదైనా విషయం గురించి ఆందోళన చెందుతుంటే రెండు చేతుల అరచేతులను రుద్దడం ద్వారా మీరు దీనిని అధిగమించవచ్చు. ఈ ట్రిక్ శారీరక అలసటను కూడా అదుపులో ఉంచుతుంది. ఆనందం, విచారం, నిరాశ, వీటిలో ఏదీ అతిగా ఉండటం మంచిది కాదు. దాంతో మనసుపై ఒత్తిడి పెరుగుతుంది. శారీరక, భావోద్వేగ బాధల నుంచి ఉపశమనం కలిగించి, భావోద్వేగాలను నియంత్రణలో ఉంటాయి.మనస్సు చంచలంగా ఉంటే లేదా నాడీ ఉద్రిక్తతను నియంత్రించలేకపోతే నిద్ర రాదు. కాబట్టి మీరు రాత్రి నిద్రపోయే ముందు రెండు చేతుల అరచేతులను రుద్దడానికి ప్రయత్నించవచ్చు. శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో సహాయపడుతుంది.



# తరచూవాడే వస్తువులతో క్యాన్సర్ వస్తుందా?

మనం ఎన్నో వస్తువులను సైతం ఉపయోగిస్తూ ఉంటాము.. అయితే ఇందులో చాలా ప్రమాదకరమైన వస్తువులను మనం ఉపయోగించడం వల్ల క్యాన్సర్ బారిన పడే అవకాశం ఉంటుందట.ముఖ్యంగా మనం ఇంట్లో ఉపయోగించేటువంటి వస్తువుల వల్ల పలు రకాల ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తూ ఉంటుంది. ముఖ్యంగా క్యాన్సర్ కారక ఉత్పత్తులను చాలామంది ఇళ్లల్లో ఉపయోగిస్తూ ఉన్నారట. ఇటీవలే కొంతమంది నిపుణులు పలు రకాల పరిశోధనలు చేసి ఇందులో కొన్ని ప్రమాదకరమైన క్యాన్సర్ కారకాలను కలిగి ఉన్న వస్తువులను గురించి కొన్ని తెలియజేశారు. ముఖ్యంగా క్లీనింగ్ ప్రొడక్షన్ నుంచి మనం ప్రతిరోజు ఉపయోగించే షాంపుల వరకు చాలా వాటిలో క్యాన్సర్ కు కారణమయ్యే పలు రకాల అంశాలు ఉన్నాయట.. మరి కొన్ని వాటిలో రసాయనాలను కలిపిన వాటిని మనం ప్రతిరోజు ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా చాలా షాంపులలో కండిషనర్లలో చాలా ప్రమాదకరమైన సోడియం లారీలు సల్ఫేట్ ఉపయోగిస్తున్నారట.. ఇది చాలా సువాసనమైనది. అలాగే సింథటిక్ రంగులను ఉపయోగించి పలు రకాల వాటిని తయారు చేస్తున్నారట. అలాగే పారాబెన్లు రసాయక కారకాలు క్యాన్సర్ వంటి కలిగించేలా చేస్తాయట. 99 శాతం బ్రెస్ట్ క్యాన్సర్ వాటిని ఇవి ఎక్కువగా కలిగిస్తున్నాయని నిపుణులు తెలియజేస్తున్నారు. ముఖ్యంగా కలర్ కెమికల్స్ లో సింథటిక్ వంటి పదార్థాన్ని ఉపయోగించడం వల్ల పుట్టే పిల్లలలోనే కూడా నరాల బలహీనత లోపాలు క్యాన్సర్ తో పుడుతున్నట్లుగా పలు రకాల సర్వేలు తేల్చి చెప్పాయి. అలాగే పెర్ఫ్యూమ్ లు కూడా చాలా వాటిలో విషపూరితమైన పదార్థాలు ఉన్నట్లుగా గుర్తించారు. అలాగే నాన్ స్టిక్ పాత్రలలో కూడా థావా మరియు కుక్కర్లను ఉపయోగిస్తూ ఉంటాము.. ఇలాంటి వాటిలో మనం ఏదైనా ఉడికించడం లేదా వంట చేయడం వంటివి చేయడం వల్ల ఇందులో చాలా హానికరమైన అంశాలు ఉన్నట్లు గుర్తించారు. ఇందులో సింథటిక్ పూతను పూయడం జరుగుతుంది. ఇందులో టెల్ఫోన్ అనే రసాయం కూడా ఉంటుందట. ప్లాస్టిక్ ని 450 డిగ్రీల కంటే ఎక్కువ వేడి చేసినప్పుడు ఇది ఒక రసాయనం గా మారుతుందట.



# ప్యాకెట్ పాలను పచ్చిగా తాగాలా?

చాలా మందికి అల్పాహారంగా ఓట్స్ లేదా కార్న్‌ఫ్లేక్స్ తినడం అలవాటు. కాబట్టి వీరికి తప్పనిసరిగా పాలు అవసరం. ఇంట్లో పిల్లలు ఉంటే ప్రతిరోజూ ఒక గ్లాసు పాలు తప్పకుండా ఇవ్వాలి. అలాగే చాలా మందికి రాత్రి పడుకునే ముందు గ్లాసు పాలు తాగే అలవాటు ఉంటుంది. కొందరైతే కొద్దిగా పసుపు కలిపి పాలు తాగుతుంటారు. రోజూ పాలు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు తక్కువేమీ కాదు. శరీరంలో కాల్షియం లోపాన్ని పూరించడానికి పాలు సహాయపడుతుంది. పాలలో కాల్షియం, ఫాస్పరస్, పొటాషియం, విటమిన్ డి వంటి వివిధ క్రియాశీల పదార్థాలు పుష్కలంగా ఉంటాయి. నిత్యం పాలు తాగడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. రోగాలు త్వరగా నయం కావాలంటే పాలు తాగడం మంచిది. పాలలో ఉండే అనేక ప్రయోజనకరమైన పదార్థాలు దంతాలు, ఎముకల సంరక్షణలో సహాయపడతాయి. చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే పాలు కూడా చాలా ముఖ్యం. అయితే చాలా మంది ప్యాకెట్ పాలు వాడుతుంటారు. మార్కెట్ నుండి కొనుగోలు చేసిన ప్యాకేజ్డ్ పాలు ఆరోగ్యానికి సురక్షితమేనా? ప్యాకెట్ పాలను నేరుగా పచ్చిగా తీసుకోవడం ఆరోగ్యానికి మంచిదేనా? లేదా కాచినవే తీసుకోవాలా? గతంలో ఆవులు, గేదెల నుంచి సేకరించిన పాలను వినియోగించేవారు. ప్రస్తుతం అందరూ 'టెట్రా ప్యాక్' లేదా ప్యాకెట్ పాలను వాడుతున్నారు. అన్ని చోట్లా ఈ పాలను వినియోగించే ట్రెండ్ కూడా పెరిగింది. కానీ ప్యాకెట్ పాలు పాశ్చరైజ్డ్ చేసి ఉంటాయి. పాలను స్టెరిలైజ్ చేసి నిల్వ చేసే ప్రక్రియను పాశ్చరైజేషన్ అంటారు. పాలను 72 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద 15 సెకన్ల పాటు ఉడకబెట్టడం ద్వారా ప్రత్యేక పద్ధతిలో ఎక్కువ కాలం నిల్వ చేయడానికి పాశ్చరైజ్ చేస్తారు. మార్కెట్‌లో స్టెరిలైజ్ చేసి ప్యాక్ చేసిన పాశ్చరైజ్డ్ పాలను కాగబెట్టకుండా పయోగించవచ్చని చాలా మంది అనుకుంటారు. కానీ స్టెరిలైట్ చేసినా మరిగించకుండా పాలను నేరుగా తీసుకోవడం సరికాదని వైద్యులు చెబుతున్నారు. ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఎక్కువట. కాబట్టి పాశ్చరైజేషన్ పాలను తప్పనిసరిగా కాగబెట్టి వినియోగించాలి.



# ఒత్తిడిని పెంచే ఆహారాలు..!



చాలామంది ఎక్కువ స్ట్రెస్ కు గురవుతూ ఉంటారు. బయట ఫుడ్ తినటం వల్ల ఎక్కువ స్ట్రెస్ కి గురయ్యే అవకాశం ఉంటుంది. ఎందుకంటే బయట ఫుడ్ ఆరోగ్యానికి అంత మంచిది కాదు.ఆహారాలలో ఆరోగ్యానికి మేలు చేసే గుణమే కాదు,అధికంగా తీసుకుంటే అనారోగ్యాలకు, మానసిక ఒత్తిడికి గురి చేసే లక్షణం కూడా కొన్నింటిలో ఉంటుంది. కాబట్టి తరచుగా స్ట్రెస్ రిలేటెడ్ ఇష్యూస్ ఉన్నవారు కొన్ని రకాల ఫుడ్స్ కు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో చూద్దాం. ఒత్తిడి అంటే ఫిజికల్ గా .. మెంటల్ గా ఆందోళనకు గురికావడం.సాధారణంగా ప్రతికూల ఆలోచన, బాధాకరమైన సంఘటన వంటివి ఇందుకు కారణం అవుతుంటాయని అందరికీ తెలిసిందే. అయితే కొన్ని రకాల ఆహారాలు కూడా ఒత్తిడికి గురిచేస్తాయని నిపుణులు అంటున్నారు. ఆ సందర్భంలో నిరాశ, నిస్పృహ, కోపం, ఆత్రుత వంటి భావాలు అధికం అవుతాయి. ఒత్తిడి స్థాయిని బట్టి తలనొప్పి, నిద్రలేమి వంటి సమస్యలు కూడా వస్తుంటాయి. డ్రెస్ రిలేటెడ్ ఆహారాలు, పానీయాల విషయానికి వస్తే మద్యం, జంక్ ఫుడ్స్, స్వీటెనర్లు, టి, కాఫీ వంటివి ప్రధానం గా ఉంటున్నాయి. మద్యం లేదా ఆల్కహాల్ అధికంగా సేవించే వారిలో సహజంగానే ఒత్తిడి, చికాకు వంటివి కనిపిస్తాయి. ఇక ఫాస్ట్ లేదా జంక్ ఫుడ్స్ కూడా వాటిలోని పదార్థాలు, రసాయనాలు రక్తనాళాలపై ప్రతికూల ప్రభావం చూపడంతో ఆందోళన, ఒత్తిడి వంటి భావాలకు దారితీస్తాయి. కృత్రిమచక్కెరలు లేదా స్వీటెనర్స్ ఎక్కువగా తీసుకోవటం రక్తపోటును, మధుమేహాన్ని మరింత పెంచుతాయి. దీంతో ఒత్తిడి మరింత పెరుగుతుంది. కాఫీ 2 3 కప్పులు తాగితే మేలు చేస్తుంది. అంతకంటే ఎక్కువ తీసుకుంటే మాత్రం అందులోని కెఫీన్ నిద్రలేమి, ఒత్తిడి, ఆందోళన వండి సమస్యలకు కారణం అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు. కాబట్టి ఎక్కువగా స్ట్రెస్ కి గురైనప్పుడు కాఫీ చాలా తక్కువగా తాగటం మంచిది.

# వడగళ్ల వానలకు భారీగా దెబ్బతిన్న పంటలు

- సిద్దిపేట జిల్లాలోనే 10 వేల ఎకరాల్లో నష్టం
- పంటపొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే హరీష్ రావు
- రైతులను ఆదుకోవాలని ప్రభుత్వానికి డిమాండ్





**సిద్దిపేట, ఏప్రిల్ 12 :** రాష్ట్రవ్యాప్తంగా పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు డిమాండ్ చేశారు. వడగండ్ల వానకు పంట నష్టపోయిన రైతకు కూడా ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. ఒక్క సిద్దిపేట జిల్లాలోనే 10 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. గత ఎండాకాలం జిల్లాలో 1350 ఎకరాల్లో వడగళ్ల వానకు పంటనష్టం జరిగిందని, ఇప్పటివరకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించలేదన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలోని నంగునూర్ మండలం రాజ్‌గోపాల్‌పేట గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. వడగండ్ల వానతో రైతులు తీవ్రమైన ఆందోళనలో ఉన్నారన్నారు. రాగుల బాలయ్య అనే రైతు, ఆయన సతీమణి బాలమ్మలకు మూడెకరాల పొలం ఉందని, రెండు లక్షల పైనున్న రుణాన్ని అప్పు తెచ్చి కట్టామని ఇంకా రుణమాఫీ కాలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రుణమాఫీ కాలేదని, రైతుబంధు పడలేదనే బాధలో ఉన్నాని చెప్పారు. అసెంబ్లీలో ఈ ప్రభుత్వం చాలా గొప్పగా చెప్పింది. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే పంటల బీమా తెస్తాం, రైతు బంధు రూ.15 వేలు ఇస్తాం, రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామన్నారు. వానకాలం రైతుబంధు పూర్తిగా ఎగ్గొట్టారు. యాసంగి సగం మందికి వేసామన్నారు ఆ సగం మందికి కూడా పూర్తిగా రైతుబంధు రాలేదు. కేసీఆర్ హయాంలో అందరికీ రైతుబంధు డబ్బులు పడ్డాయి. ఈ ప్రభుత్వం కోతలు పెట్టాలని మొత్తం సర్వే నంబర్లలో అద్దెకరం, పావు ఎకరం ఎక్కువ ఉందనే సాకుతో రైతులకు రైతుబంధు ఆపారు. రూ.9 వేల కోట్ల రైతుబంధు ఇవ్వాల్సి ఉంటే రూ.4 వేల కోట్లు మాత్రమే ఇచ్చాం అంటున్నారు. ఇంకా రూ.5 వేల కోట్లు పంటపెట్టుబడి సాయానికి కోతపెట్టారు. వానకాలం రూ.9 వేల కోట్లు, ఈ యాసంగి రూ.5 వేల కోట్లు.. మొత్తం రూ.14 వేల కోట్లు ప్రభుత్వం రైతులకు ఎగబెట్టింది. 14 వేల కోట్లు రైతుబంధు ఎగ్గొట్టి వాటిని రుణమాఫీలో ఇచ్చినట్టు చూపిస్తున్నారు. కరోనా కష్టకాలంలో కూడా రైతులకు కేసీఆర్ రైతుబంధు ఆపలేదు. పంట బీమాకు సంబంధించి బడ్జెట్‌లో డబ్బులు పెట్టి ఒక్క రైతుకు కూడా ఇవ్వలేదు. వంట నష్టపరిహారం ఎకరానికి రూ.6 వేలు ఉంటే కేసీఆర్ రూ.10వేలకు పెంచారు. పోయిన ఎండాకాలం సిద్దిపేట జిల్లాలో 1,350 ఎకరాల్లో వడగళ్ల వానకు పంట నష్టం జరిగింది. వాటికి ఇప్పటివరకు ప్రభుత్వం పరిహారం చెల్లించలేదు. తక్షణమే పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని డిమాండ్ చేస్తున్నాం. ఆరుగాలం కష్టం చేసిన రైతులకు నోటికాడి బుక్క కొట్టిన ట్టు అయింది. నంగునూరు మండలంలో 11 గ్రామాల్లో దాదాపు 5,300 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు గుర్తించాం. ఒక సిద్దిపేట జిల్లాలోనే 10 వేల ఎకరాలు పంట నష్టం జరిగిందని అంచనా. 2500 ఎకరాల హార్టికల్చర్ పంటలు కూడా నష్టపోయాయి. ఇన్‌పుట్ సబ్సిడీతోపాటు యాసంగి రైతుబంధు కూడా వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రైతు బీమా విషయంలో కూడా ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. చాలామంది చనిపోయిన రైతులకు రైతు బీమా అందడం లేదు. వెంటనే చనిపోయిన రైతు కుటుంబాలకు రైతు బీమా డబ్బులను విడుదల చేయాలి. కేసీఆర్ ప్రభుత్వంలో అనేక విత్తనాలు సబ్సిడీ కింద ఇచ్చేవారు. కందులు, పెసర్లు, వరి లాంటి విత్తనాలను సబ్సిడీ కింద ప్రభుత్వం అందించేది. ప్రభుత్వం సబ్సిడీ కింద విత్తనాలను అందుబాటు–లో పెట్టి రైతులకు సకాలంలో అందించాలని కోరుతున్నాం. పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు వచ్చే వానకాలానికి విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. కౌలు రైతుల గురించి ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు. కౌలు రైతుకు రైతుబంధు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు ఎందుకు మాట్లాడటం లేదు. ఇటు– రైతు బంధు రాక ఇన్పుట్ సబ్సిడీ రాక కౌలు రైతులు ఇబ్బంది పడుతున్నారు. తక్షణమే వడగండ్ల వానకు పంట నష్టపోయిన కౌలు రైతులకు కూడా ఇన్పుట్ సబ్సిడీ ఇవ్వాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## వనజీవి మృతికి ప్రధాని దిగ్భ్రాంతి

### సంతాపం తెలుపుతూ ఎక్స్‌లో పోస్ట్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 :** పద్మశ్రీ పురస్కార గ్రహీత వనజీవి రామయ్య మృతిపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుస్థిరత కోసం గళం వినిపించిన వ్యక్తిగా రామయ్య గుర్తుండిపోతారని అన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా తెలుగులో పోస్టు చేశారు. లక్షలాది మొక్కలు నాటడానికి, వాటిని రక్షించడానికి రామయ్య తన జీవితాన్ని అంకితమిచ్చారు. ఆయన అవిశ్రాంత కృషి.. ప్రకృతి పట్ల గాఢమైన ప్రేమనూ, భవిష్యత్ తరాలపట్ల బాధ్యతను ప్రతిబింబిస్తాయి. ఆయన చేసిన కృషి.. యువతలో మరింత సుస్థిరమైన హరిత గ్రహాన్ని నిర్మించాలనే తపనను ప్రేరేపిస్తూనే ఉంటుంది. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఓం శాంతి' అంటూ రాసుకొచ్చారు.



## కాంగ్రెస్ పాలనతో ప్రజల జీవనంలో మార్పు

- ప్రజలకు చేయూతను ఇచ్చేలా పథకాల అమలు
- ట్వీట్ చేసిన సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 12 :** తెలంగాణలో పాలన మారిన కొద్ది నెలల లోపే, సామాన్య ప్రజల జీవనశైలిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ట్వీట్ ద్వారా ప్రకటించారు. దేశంలో అత్యధిక ద్రవ్యోల్బణం ఉన్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణ, ఇప్పుడు అత్యల్ప ద్రవ్యోల్బణం కలిగిన రాష్ట్రంగా మారడం ప్రజల ప్రభుత్వ విజయానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజలు తీవ్రంగా ద్రవ్యోల్బణ భారం ఎదుర్కొనాల్సి వచ్చిందని, ముఖ్యంగా నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకిన సందర్భాలు తరచూ చూశామని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత, సాధారణ ప్రజానీకాన్ని కేంద్రీకరించి అమలు చేస్తున్న విధానాలు తక్షణ ఉపశమనం కలిగించాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డిపేర్కొన్న పలు కీలక కార్యక్రమాలు ఇప్పటికే అమల్లో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం ద్వారా వారి ఆర్థిక భారం తగ్గించడం సాధ్యమైంది. గ్యాస్ సిలిండర్ ధరలు దేశవ్యాప్తంగా పెరుగుతున్న సమయంలో, తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వినూత్నంగా నిలిచింది. ఇళ్లకు ఉచితంగా 200 యూనిట్ల వరకు విద్యుత్ ఇవ్వడం ద్వారా మధ్య తరగతి మరియు పేద కుటుంబాలకు భారం తగ్గింది. ఆరోగ్య సంరక్షణలో అద్భుతమైన పరిష్కారంగా, సామాన్య ప్రజలకు వైద్య ఖర్చులను భరించే అవకాశం. ఇప్పటికే ఉన్న రేషన్ సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచి, అధిక నాణ్యత కలిగిన బియ్యాన్ని ఉచితంగా అందించడం ద్వారా పోషకాహార భద్రతను పెంచారు.

## తనిఖీల్లో హాష్ ఆయిల్ పట్టివేత

**హైదరాబాద్, ఏప్రిల్ 12 :** నగరంలో రాచకొండ పోలీసులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భారీగా హాష్ అయిల్‌ను పట్టుకున్నారు. హాష్ అయిల్‌ను తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు– భువనగిరి రూరల్ పోలీసులు తెలిపారు. ఇద్దరి వ్యక్తుల దగ్గరి నుంచి హాష్ అయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒడిస్సా నుంచి హైదరాబాద్‌కు హాష్ అయిల్‌ను వాహనంలో తరలిస్తున్న సమయంలో పట్టుకున్నారు. దీనివిలువ రూ.80లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.

## ఉత్సాహభరితంగా హనుమాన్ శోభాయాత్ర



- హనుమత్ జయంతి సందర్భంగా ర్యాలీ
- గౌలిగూడ నుంచి తాడ్బంద్ వరకు యాత్ర
- ప్రత్యక్షంగా పర్యవేక్షించిన సిపి సివి ఆనంద్
- తాడ్‌బంద్ ఆంజనేయుడిని దర్శించుకున్న నటి ప్రీతిజింటా

**హైదరాబాద్, ఏప్రిల్ 12 :** గౌలిగూడలోని శ్రీరామ మందిరం నుంచి హనుమాన్ శోభాయాత్ర శనివారం ఉత్సాహభరితంగా ప్రారంభమైంది. హనుమత్ జయంతిని పురస్కరించుకుని గౌలిగూడ నుంచి కోఠి, నారాయణగూడ బైపాస్ మీదుగా సికింద్రాబాద్‌లోని తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు ఈ ర్యాలీ సాగింది. యాత్రలో పాల్గొనేందుకు భక్తులు భారీగా తరలివచ్చి పాల్గొన్నారు. 12 కిలోమీటర్ల యాత్రకు భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో అడుగడుగునా నిఘా ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నగర సీపీ సీవీ ఆనంద్ గౌలిగూడలోని శ్రీరామ మందిరానికి చేరుకుని భద్రతా ఏర్పాట్లు పర్యవేక్షించారు. అలాగే కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం నుంచి వీర హనుమాన్ శోభాయాత్ర ప్రారంభమైంది. సైదాబాద్, మాదన్నపేట మీదుగా ఈ యాత్ర కొనసాగుతుంది. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఊరూవాడా వీరహనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. వేలాది మంది భక్త జనసందోహం నడుమ హనుమాన్ శోభాయాత్ర కన్నులపండువగా సాగుతోంది. గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ హనుమాన్ ఆలయం వరకు శోభాయాత్ర సాగనుంది. ఇదిలా ఉండగా.. హనుమాన్ జయంతి సందర్భంగా పంజాబ్ కింగ్స్ ఓనర్ ప్రీతి జింటా తాడ్‌బండ్ వీరాంజనేయస్వామిని దర్శించుకున్నారు. శనివారం ఉదయం తాడ్‌బండ్ హనుమాన్ ఆలయానికి వచ్చిన ప్రీతి జింటా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పల్ వేదికగా సన్‌రైజర్స్‌తో పంజాబ్ కింగ్స్ తలబడనుంది. ఈ సందర్భంగా పంజాబ్ కింగ్స్ విజయాన్ని కోరుతూ ప్రీతిజింటా వీరాంజనేయ స్వామిని దర్శించుకున్నారు. కాగా.. ఉప్పల్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌తో సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపబడనుంది. ఈ మ్యాచ్ సన్‌రైజర్స్‌కు అత్యంత కీలకమని చెప్పుకోవాలి. ఇప్పటి వరకు ఆడిన ఐదు ఆటల్లో వరుసగా నాలుగు మ్యాచుల్లోనూ సన్‌రైజర్స్ ఓటమి బాటపట్టిన విషయం తెలిసిందే. కేవలం ఒక్క మ్యాచ్‌లోనే సన్‌రైజర్స్ టీం గెలుపొందింది. దీంతో ఈ మ్యాచ్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సన్‌రైజర్స్.. ఇందులో ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో ఉంది. ప్లేఆఫ్ ఆశలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తప్పకుండా గెలిచి తీరాల్సిందే. ఇకపై జరిగే ప్రతీ మ్యాచ్ కూడా సన్‌రైజర్స్‌కు అత్యంత కీలకమే. ఇక పంజాబ్ కింగ్స్ విషయానికొస్తే... గత మ్యాచ్‌లో చెన్నై సూపర్‌కింగ్స్‌ను ఓడించింది. ఈ నేపథ్యంలోనే ప్రీతి జింటా తాడ్‌బండ్ హనుమంతుడి ఆలయాన్ని సందర్శించడం, ఆంజనేయుడి ఆశీస్సులు తీసుకోవడం చర్చనీయాంశంగా మరింది.

## దమ్ముంటే ఆ ఎంపి ఎవరో చెప్పండి?

### కేటీఆర్‌కు ఎంపి డికె అరుణ సవాల్



**విజయవాడ, ఏప్రిల్ 12 :** సెంట్రల్ యూనివర్సిటీ సమీపంలోని కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కాకరేపుతోంది.. మాజీ మంత్రి కేటీఆర్ ఈ వ్యవహారంలో కాంగ్రెస్, బీజేపీపై ఆరోపణలు గుప్పించారు.. సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూనే.. ఓ బీజేపీ ఎంపీకి కూడా సంబంధం ఉందని కామెంట్ చేశారు.. ఈ నేపథ్యంలో కేటీఆర్‌పై బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ ఫైర్ అయ్యారు.. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆమె.. కేటీఆర్ కి దమ్ముంటే ఆ ఎంపీ పేరు చెప్పాలి కదా అని సవాల్ చేశారు.. ఎవరి గురించి మాట్లాడాడో చెప్పకుండా... ఒక ఎంపీ అని గాలివార్త చెప్తే సరిపోదు కదా. అని నిలదీశారు.. దక్షిణాదిపై భారతీయ జనతా పార్టీ ఫోకస్ పెట్టింది.. తెలంగాణలో మొన్న ఎన్నికల్లో విజయవంతంగా ఎనిమిది మంది ఎంపీలు గెలిచాం... ఆంధ్రాలో కూడా బీజేపీ ఎంపీలు గెలిచారన్న డీకే అరుణ.. ఆంధ్రలో ఎన్డీఏ ప్రభుత్వం ఉంది... తెలంగాణలో బీజేపీ స్వతంత్రంగా అధికారంలోకి రాబోతుందన్నారు.. ఏపీలో కూడా మళ్లీ ఎన్డీఏ అధికారంలోకి వస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు.. మరోవైపు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. ఇద్దరూ ఒక్కటే కాబట్టి... తమిళనాడులో జరిగిన స్టాలిన్ సమావేశానికి వెళ్లారని విమర్శించారు.. తమిళనాడులో తండ్రీ కొడుకులే ఉండాలనుకుంటున్నారు కాబట్టి.. ఏదేదో కామెంట్ చేస్తున్నారు అంటూ ఎంపీ డీకే అరుణ మండిపడ్డారు..



## కేటీఆర్ మాటల్లో వాస్తవం లేదు

### చామల కిరణ్‌కుమార్

**హైదరాబాద్:** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన ఆరోపణలను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఖండించారు. కేటీఆర్ నోటికొచ్చినట్లుగా మాట్లాడి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆయన మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. టీజీఐఐసీకి ఐసీఐసీఐ బ్యాంకు రుణం ఇచ్చినట్లు కేటీఆర్ చెప్పడంలో వాస్తవం లేదన్నారు. టీజీఐఐసీ ఫేస్ వాల్యూ చూసి 27 కంపెనీలు బాండ్లు కొనుగోలు చేశాయని, తద్వారా వచ్చిన డబ్బులే ఐసీఐసీఐ బ్యాంక్ ద్వారా టీజీఐఐసీలో పడ్డాయని వివరించారు. ఐసీఐసీఐ బ్యాంకు రుణంపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతో.. కంచ గచ్చిబౌలి భూములు.. హెచ్‌సీయూ, అటవీ శాఖవి కాదని తేలిపోయిందని కిరణ్‌కుమార్ అన్నారు. పేద ప్రజలు సన్న బియ్యం అన్నం తింటుంటే.. భారాస నాయకులు ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు.

## విజయశాంతి దంపతులకు బెదిరింపులు

### చంద్రకిరణ్‌పై ఫిర్యాదుతో పోలీస్ కేసు నమోదు



**హైదరాబాద్, ఏప్రిల్ 12 :** కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి దంపతులకు బెదిరింపులు వచ్చాయి. ఈ ఘటనపై బంజారా హిల్స్ పోలీసుస్టేషన్‌లో విజయశాంతి భర్త శ్రీనివాస ప్రసాద్ ఫిర్యాదు చేశారు. 4 ఏళ్ల క్రితం చంద్రకిరణ్‌రెడ్డి తమను సంప్రదించి, సోషల్ మీడియాలో కంటె–ట్ క్రియేటర్‌గా తనను తాను పరిచయం చేసుకున్నారని ఫిర్యా దులో పేర్కొన్నారు. విజయశాంతి వద్ద సోషల్‌మీడియా హ్యాండ్లర్‌గా అవకాశం ఇవ్వాలని కోరినట్లు వివరించారు. చంద్రకిరణ్‌రెడ్డి మాతో కలిసి పనిచేస్తూ తన సొంత వ్యాపారాన్ని బలపరుచుకున్నారు. స్వలాభం కోసం మా పేరును వాడుకున్నారు. అతని పనితీరు నచ్చకపోవడంతో చంద్రకిరణ్ సేవలను వినియోగించుకోలేదు. మేం భాజపా లో ఉన్నప్పుడు అతడితో పరిచయం ఏర్పడింది. ఆ పార్టీలో ఎదిగేందుకు చంద్రకిరణ్ మమ్మల్ని వాడుకున్నారు. భాజపాలో నుంచి బయటకు వచ్చాక అతడి నుంచి మెసేజ్ వచ్చింది. పెండింగ్‌లో ఉన్న నగదు చెల్లింపులు చేయగలరా అని అందులో ఉంది. ఈక్రమంలో మావద్ద బకాయిలు ఏమీ లేవని సమాధానమిచ్చాం. అయితే ఏప్రిల్ 6న చంద్ర కిరణ్‌రెడ్డి బెదిరింపు సందేశం పంపాడు. బకాయిలు తీర్చ కుంటే మీరు శత్రువులు అవుతారని మెసేజ్ చేశాడు. ఆమోదయోగ్యం కాని రీతిలో సందేశాలు ఉన్నాయి. చంద్ర కిరణ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని శ్రీనివాస ప్రసాద్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈమేరకు వివిధ సెక్షన్ల కింద ఆయనపై కేసు నమోదు చేశారు. మీ ఇద్దరినీ చంపేస్తా – రోడ్డుకీడుస్తా అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి దంపతు లను బెదిరిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులకు విజయశాంతి దంపతులు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ విషయం వెలుగుచూసింది. అయితే చంద్రశేఖర్ పనితీ రు నచ్చకపోవడం, సరైన ఫలితాలు రాకపోవడంతో శ్రీని వాస ప్రసాద్ అతడిని ఆఫీసు నుంచి పంపించేశారు. కొన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న చంద్రశేఖర్.. ఇటీవల శ్రీనివాస్ ప్రసాద్‌కు మెసేజ్ చేశాడు. డబ్బులు ఎప్పుడిస్తారంటూ నిలదీశాడు. కాంట్రాక్ట్ కుదుర్చుకోకుండానే డబ్బులు ఎలా ఇస్తామని ఆయన అడగ్గా అసభ్యంగా దూషించాడు. ఏదైనా ఉంటే ఆఫీసుకి వచ్చిన మాట్లాడాలని ఆయన చెప్పగా తాను రానని చెప్పాడు. మ–రోవైపు.. తనకు డబ్బులు ఇవ్వాలం టూ విజయశాంతి భర్తకు చంద్రశేఖర్ మెసేజ్‌లు, మెయిల్స్ పంపుతూ వేధించసాగాడు. వాటికి శ్రీనివాస్ స్పందించక పోవడంతో.. చివరికి డబ్బులు ఇవ్వకపోతే నిన్ను, నీ భార్య విజయశాంతిని రోడ్డు మీదికి ఈడుస్తా.. ఇద్దరినీ చంపేస్తా నంటూ చంద్రశేఖర్ బెదిరింపులకు దిగాడు. దీంతో విసిగిపో యిన విజయశాంతి దంపతులు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## ప్రైవేట్ పరం కాకుండా 400 ఎకరాలు కాపాడాం


(మొదటిపేజీ తరువాయి)

హెచ్‌సీయూ భూములు, పరిసరాల్లో ఏనుగులు ఉన్నాయా? విద్యార్థులను ప్రభావితం చేసి ప్రభుత్వ పనులను అడ్డుకోవాలని చూస్తున్నారు. హైదరాబాద్‌కు పెట్టుబడులు, ఉద్యోగాలు రావొద్దని కుట్ర చేస్తున్నారు. సెబీ నిబంధనలకు అనుగుణంగానే బాండ్ల జారీ పక్రియ ఉంటుంది. ఐసీఐసీఐ నుంచి మేం ఎలాంటి లోన్లు తీసుకోలేదు. కంచ గచ్చిబౌలి భూములపై ఎలాంటి వివాదాలు లేవు. రాష్ట్ర ప్రజల సంక్షేమ కార్యక్రమాల కోసమే నిధులు సేకరిస్తున్నాం అని శ్రీధర్‌బాబు తెలిపారు. ఇదిలావుంటే కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంపై మాజీ మంత్రి, భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేసిన ఆరోపణలను భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ఖండించారు. కేటీ–ఆర్ నోటికొచ్చినట్లు–గా మాట్లాడి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఆయన మాటల్లో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. టీ–జీఐఐసీకి ఐసీఐసీఐ బ్యాంకు రుణం ఇచ్చినట్లు– కేటీఆర్ చెప్పడంలో వాస్తవం లేదన్నారు. టీ–జీఐఐసీ ఫేస్ వాల్యూ చూసి 27 కంపెనీలు బాండ్లు కొనుగోలు చేశాయని, తద్వారా వచ్చిన డబ్బులే ఐసీఐసీఐ బ్యాంక్ ద్వారా టీ–జీఐఐసీలో పడ్డాయని వివరించారు. ఐసీఐసీఐ బ్యాంకు రుణంపై కేటీ–ఆర్ చేసిన వ్యాఖ్యలతో.. కంచ గచ్చిబౌలి భూములు.. హెచ్‌సీయూ, అటవీ శాఖవి కాదని తేలిపోయిందని కిరణ్‌కుమార్ అన్నారు. పేద ప్రజలు సన్న బియ్యం అన్నం తింటుంటే.. భారాస నాయకులు ఓర్చుకోలేకపోతున్నారని విమర్శించారు.



# అభిషేక్ అల్లాడించాడు

## సన్‌రైజర్స్ హైదరాబాద్ అద్భుత విజయం



**హైదరాబాద్:** ఐపీఎల్ 2025లో వరుస ఓటములతో డీలాపడిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఎట్టకేలకు గెలుపు బాట పట్టింది. అభిషేక్ శర్మ సిక్స్‌లతో చెలరేగడంతో పంజాబ్ కింగ్స్ నిర్దేశించిన 246 పరుగుల భారీ టార్గెట్‌ను రెండే వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. కొండంత లక్ష్యాన్ని సన్‌రైజర్స్ 18.3 ఓవర్లలోనే కరిగించింది. అభిషేక్ శర్మ (141, 55 బంతుల్లో 14 ఫోర్లు, 10 సిక్స్‌లు) పంజాబ్ బౌలర్లపై పంజా విసిరాడు. వరుస ఫోర్లు, సిక్సర్లతో ఉప్పల్ మైదానంలో పరుగుల వరద పారించాడు. అభిషేక్ ధాటికి పంజాబ్ ఏకంగా ఎనిమిది మందితో బౌలింగ్ చేయించింది. అయినా, వారు అభిషేక్‌ను దూకుడు అడ్డుకోలేకపోయారు. ట్రావిస్ హెడ్ (66, 37 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) రాణించాడు. క్లాసెన్ (21, 14 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), ఇషాన్ కిషన్ (9, 6 బంతుల్లో 1 సిక్స్) పరుగులు చేశారు. పంజాబ్ బౌలర్లలో చాహల్, అర్ష్‌దీప్ ఒక్కో వికెట్ పడగొట్టారు. అంతకు ముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 245 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (82, 36 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు) చెలరేగాడు. గత మ్యాచ్‌లో సెంచరీ చేసిన ఓపెనర్ ప్రియాంశ్ ఆర్య (36, 13 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) అదే జోరును కొనసాగిస్తూ క్రీజులో ఉన్నంతసేపు విధ్వంసం సృష్టించాడు. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (42, 23 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్) కూడా మెరుపులు మెరిపించాడు. చివర్లో స్టొయినిస్ (34, 11 బంతుల్లో 1 ఫోర్, 4 సిక్స్‌లు) దంచికొట్టాడు. నేహల్ వధేరా (27) ఫర్వాలేదనిపించగా.. శశాంక్ సింగ్ (2), మ్యాక్స్‌వెల్ (3) సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగారు. సన్‌రైజర్స్ బౌలర్లలో హర్షల్ పటేల్ 4, ఎషాన్ మలింగ 2 వికెట్లు పడగొట్టారు. ఈ సూపర్ ఇన్నింగ్స్‌తో ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక స్కోరు (141) చేసిన భారత ఆటగాడిగా అభిషేక్ శర్మ రికార్డు సృష్టించాడు. కేఎల్ రాహుల్ (132) తర్వాతి స్థానంలో ఉన్నాడు. ఐపీఎల్ చరిత్రలో ఇది రెండో సక్సెస్‌ఫుల్ రన్ ఛేజ్.



# గుజరాత్ జోరుకు బ్రేక్..



## లఖ్‌నవూ హ్యాట్రిక్ విజయం

**లఖ్‌నవూ:** ఐపీఎల్ 2025లో వరుసగా విజయాలతో దూసుకుపోతున్న గుజరాత్ టైటాన్స్ కు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ షాక్ ఇచ్చింది. ఏకనా స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 180 పరుగులు చేసింది. ఈ లక్ష్యాన్ని లఖ్‌నవూ 4 వికెట్లు కోల్పోయి మూడు బంతులు మిగిలుండగా ఛేదించింది. ఓపెనర్ ఐడెన్ మార్‌క్రమ్ (58, 31 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు. వన్‌డౌన్ బ్యాటర్ నికోలస్ పూరన్ (61, 34 బంతుల్లో 1 ఫోర్, 7 సిక్స్‌లు) మరోసారి మెరుపులు మెరిపించాడు. మిచెల్ మార్ష్ ఈ మ్యాచ్‌లో ఆడకపోవడంతో ఓపెనర్‌గా వచ్చిన రిషభ్ పంత్ (21, 18 బంతుల్లో 4 ఫోర్లు) ఎక్కువసేపు క్రీజులో నిలవలేక పోయాడు. ఆయుష్ బదోని (28, 20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. అబ్దుల్ సమద్ (2) పరుగులు చేశాడు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ కృష్ణ 2, రషీద్ ఖాన్, వాషింగ్టన్ సుందర్ చెరో వికెట్ పడగొట్టారు. లఖ్‌నవూకు ఇది హ్యాట్రిక్ విజయం కాగా.. గుజరాత్‌కు రెండో ఓటమి.

### మెరిసిన పూరన్, మార్‌క్రమ్

లక్ష్యఛేదనలో లఖ్‌నవూకు శుభారంభం లభించింది. పంత్, మార్‌క్రమ్ తొలి వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. గుజరాత్ ఫీల్డర్ల తప్పిదాలు కూడా లఖ్‌నవూకు కలిసొచ్చాయి. పంత్‌కు ఒక లైఫ్ రాగా సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ప్రసిద్ధ్ వేసిన ఐదో ఓవర్‌లో మార్‌క్రమ్‌కు రెండు జీవదానాలు లభించాయి. ప్రసిద్ధ్ బౌలింగ్‌లో పంత్.. సుందర్‌కు క్యాచ్ ఇచ్చాడు. తర్వాత క్రీజులోకి వచ్చిన పూరన్.. దూకుడుగా ఆడాడు. సాయి కిశోర్ వేసి 10 ఓవర్‌లో మూడు సిక్సర్లు బాదేశాడు. అదే ఓవర్‌లో మార్‌క్రమ్ హాఫ్ సెంచరీ (26 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. మార్‌క్రమ్‌ను ప్రసిద్ధ్ ఔట్ చేశాడు. అప్పటికే స్కోరు 120 దాటింది. సిరాజ్ బౌలింగ్‌లో పూరన్ సిక్స్, ఫోర్ కొట్టి అర్ధ శతకం (24 బంతుల్లో) అందుకున్నాడు. జోరు మీదున్న పూరన్‌ను రషీద్ ఖాన్ వెనక్కి పంపాడు. ఈ దశలో బదోని నిలకడగా ఆడాడు. మిల్లర్ (7)ని సుందర్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. చివరి ఓవర్‌లో లఖ్‌నవూ విజయానికి ఆరు పరుగులు అవసరం గా.. తొలి బంతికి సమద్ సింగిల్ తీశాడు. తర్వాత బదోని వరుసగా ఫోర్, సిక్స్ కొట్టి మ్యాచ్‌ని ముగించాడు.

### భారీ స్కోరు చేసేలా కనిపించినా..

ఓపెనర్లు గుజరాత్‌కు అదిరిపోయే శుభారంభం అందించారు. క్రీజులో పాతుకుపోయిన గిల్, సుదర్శన్ రిస్కీ షాట్ల జోలికి వెళ్లకుండా నిలకడగా బౌండరీలు బాదారు. 8 ఓవర్లకు వరకు ప్రతి ఓవర్‌లో కనీసం ఒక్క బౌండరీ రాబట్టారు. గిల్ 31 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. దిగ్వేశ్ సింగ్ రాఠీ బౌలింగ్‌లో 46 పరుగుల వద్ద సుదర్శన్ ఇచ్చిన క్యాచ్‌ను అబ్దుల్ సమద్ డ్రాప్ చేశాడు. అదే ఓవర్‌లో చివరి బంతికి ఫోర్ కొట్టి సుదర్శన్ హాఫ్ సెంచరీ (32 బంతుల్లో) అందుకున్నాడు. ఈ క్రమంలో 12 ఓవర్లకు 120/0 స్కోరుతో పటిష్ట స్థితిలో నిలిచిన గుజరాత్ సునాయసంగా 200కు పైచిలుకు పరుగులు చేసేలా కనిపించింది. కానీ, 13 ఓవర్ నుంచి లఖ్‌నవూ బౌలర్లు పుంజుకున్నారు. 25 పరుగుల వ్యవధిలో నాలుగు వికెట్లు పడగొట్టి స్కోరు వేగానికి కళ్లెం వేశారు. అవేశ్ ఖాన్ బౌలింగ్‌లో గిల్.. మార్‌క్రమ్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో 120 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాసేపటికే రవి బిష్ణోయ్ ఒకే ఓవర్‌లో సుదర్శన్, వాషింగ్టన్ సుందర్‌ను వెనక్కి పంపాడు. నిలకడగా ఆడిన బట్లర్.. దిగ్వేశ్ బౌలింగ్‌లో శార్దూల్ ఠాకూర్‌కు చిక్కాడు. దీంతో 17 ఓవర్లకు గుజరాత్ 147/4తో నిలిచింది. తర్వాత 18, 19 ఓవర్లలో కలిపి 22 రన్స్ వచ్చాయి. ఇన్నింగ్స్ చివరి ఓవర్ వేసిన శార్దూల్ వరుసగా రెండు వికెట్లు పడగొట్టాడు. రూథర్ ఫోర్డ్ ఎల్బీడబ్ల్యూగా వెనుదిరగ్గా.. తర్వాత బంతికే రాహుల్ తెవాతియా (0).. మార్‌క్రమ్‌కు క్యాచ్ ఇచ్చాడు.




# యూపీఐ సేవల్లో మరోసారి అంతరాయం..

డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ యూపీఐలో మరోసారి అంతరాయం ఏర్పడింది. దేశవ్యాప్తంగా ఈ సేవలకు ఆటంకం ఏర్పడింది. ఎవరికైనా చెల్లింపులు చేస్తుంటే జరగడం లేదంటూ సామాజిక మాధ్యమాల్లో వందలాది మంది పోస్టులు పెడుతున్నారు. గూగుల్ పే, ఫోన్‌పే, పేటీఎం వంటి యాప్స్ పనిచేయడం లేదు. డౌన్ డిటెక్టర్ వెబ్‌సైట్ ప్రకారం.. మధ్యాహ్నం 12 గంటల సమయానికి దాదాపు వెయ్యి మందికి పైగా యూపీఐ సేవల్లో అంతరాయం గురించి ఫిర్యాదు చేశారు. దీనిపై ఎన్‌పీసీఐ స్పందించింది. సాంకేతిక సమస్య వల్ల చెల్లింపుల్లో అవాంతరం ఎదురవుతోందని పేర్కొంది. దీన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపింది. కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఇవాళ ఒక్కరోజే కాదు.. యూపీఐ సేవల్లో ఇటీవల తరచూ ఈ అవాంతరం ఎదురవుతోంది. మార్చి 26న ఇదే పరిస్థితి నెలకొనగా.. సాంకేతిక కారణంతో ఈ పరిస్థితి తలెత్తిందని ఎన్‌పీసీఐ అప్పట్లో వివరణ ఇచ్చింది. ఏప్రిల్ 2న కూడా యూపీఐ చెల్లింపులు కొంతసేపు నిలిచిపోయాయి. రోజుల వ్యవధిలో తాజాగా మరోసారి ఈ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ సేవల్లో ఆటంకం ఏర్పడింది.

## అంతర్జాతీయ చెల్లింపులకు క్యూఆర్ పంపిస్తే కుదరదు

డిజిటల్ చెల్లింపుల విషయంలో మరో కొత్త నిబంధన అమల్లోకి వచ్చింది. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా అంతర్జాతీయ చెల్లింపుల కోసం 'క్యూఆర్ షేర్ అండ్ పే' పద్ధతిని రద్దు చేస్తున్నట్లు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది. దీంతో విదేశాల్లో ఉన్న భారతీయ ప్రయాణికులు, ప్రవాసులు.. ఇక్కడి వ్యాపారులు పంపిన క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేసి, చెల్లింపులు చేయలేరు. చెల్లింపుల విషయంలో వినియోగదారులకు మరింత భద్రత కల్పించేందుకు ఈ నిర్ణయం తోడ్పడనుంది. అయితే వినియోగదారులకు ఉన్న సౌలభ్యం కొంత తగ్గుతుంది. ఇప్పటివరకు ఇలా: వ్యాపారులు వాట్సప్ లేదా ఇతర సామాజిక మాధ్య యాప్‌ల ద్వారా క్యూఆర్ కోడ్‌ను పంపించేవారు. విదేశాల్లో ఉన్న వారు యూపీఐ అనుసంధాన యాప్‌లతో దాన్ని స్కాన్ చేసి, చెల్లింపులు చేసేవారు. కొత్త నిబంధనల నేపథ్యంలో దేశీయ లావాదేవీలకు మాత్రమే క్యూఆర్ పరిమితం అవుతుంది. దేశీయ లావాదేవీలపైనా పరిమితులు: దేశీయ చెల్లింపుల కోసమూ కొన్ని పరిమితులు విధించింది. ఎన్‌పీసీఐ దగ్గర నమోదు కాని వ్యాపారులకు ఈ పద్ధతిలో ఒకేసారి రూ.2,000కు మించి చెల్లించడం సాధ్యం కాదు. మరో ముఖ్యమైన మార్పునూ ఎన్‌పీసీఐ తీసుకొచ్చింది. వాలెట్‌లు, ప్రీపెయిడ్ కార్డులను లోడ్ చేయాలని చెబుతూ 'కలెక్ట్ రిక్వెస్ట్'లను రద్దు చేసింది. ఇప్పుడు వినియోగదారులే స్వయంగా వాటిలో డబ్బు జమ చేసుకోవాల్సి ఉంటుంది.

# భారత్‌లో ఎందుకంత బిజీగా ఉంటారు..?

## నిఖిల్ కామత్ ప్రశ్నకు బిల్‌గేట్స్ సమాధానం




ప్రముఖ జిరోదా సంస్థ సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహిస్తున్న పాడ్‌కాస్ట్‌లో ప్రపంచ కుబేరుల్లో ఒకరు, మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ గతేడాది పాల్గొన్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన రెండో భాగాన్ని శుక్రవారం విడుదల చేశారు. ఈ పాడ్‌కాస్ట్‌లో పలు ఆసక్తిర విషయాల గురించి వీరిరువురూ చర్చించుకున్నారు. భారత్ (%×అఎఖు%)లో ఉన్నన్ని రోజులు ఎందుకు బిజిబిజీగా కనిపిస్తారని నిఖిల్ ప్రశ్నించారు. దీనికి గేట్స్ చాలా ఫన్నీగా బదులిచ్చారు. 'ఎందుకంటే అలా ఉండటం నాకు చాలా సరదాగా ఉంటుంది. కఠినంగా ఉంటూ పనిచేయాలి అనుకుంటూ మిమ్మల్ని మీరు మోసం చేసుకోకూడదు' అని ఆయన పేర్కొన్నారు. గేట్స్ ఇప్పటికే అనేకసార్లు భారత్‌లో పర్యటించారు. ఈ ఏడాది మార్చిలోనూ ఆయన ఇక్కడికి వచ్చారు. ఆ సమయంలో ప్రధాని మోదీతో సహా పలువురు కేంద్ర మంత్రులను కలిశారు. ఇక, పెట్టుబడుల కోణంలో అధిక జనాభా మంచిదా, కాదా అని నిఖిల్ ప్రశ్నించారు. దీనికి గేట్స్ బదులిస్తూ.. దాదాపు రెండేళ్లలో ఏఐ అన్నింటినీ మార్చేస్తుందన్నారు. ప్రజలు తొందరగా పదవీ విరమణ చేసేయొచ్చని, పని వారాలు కూడా తగ్గిపోతాయన్నారు. ప్రజలు తమ సమయాన్ని ఎలా గడపాలి అనే దానిపై ఆలోచనలు చేయాల్సిఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా తనకు పని లేకపోయినా తాను దాన్ని కల్పించుకుంటున్నానని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రజలు కూడా ఏఐతో వచ్చే మార్పుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఈ పాడ్‌కాస్ట్‌లో గేట్స్ దాతృత్వం గురించి కూడా చర్చించుకున్నారు.

# మనిషి ఆలోచనలు.. సంభాషణ కూడా

## సరికొత్త ఏఐని ఆవిష్కరించిన మివి

**హైదరాబాద్ :** కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత అంటే.. మనం ప్రశ్నలు టైప్ చేస్తే, దానికి సమాధానాలు అక్షర రూపంలో వస్తోందే ఇప్పటివరకు చూస్తున్నాం. దీనికి భిన్నంగా ఒక వ్యక్తిలా ఆలోచించి, సంభాషించేలా సరికొత్త ఏఐని రూపొందించినట్లు హైదరాబాద్‌కు చెందిన ఎలక్ట్రానిక్ బ్రాండ్ సంస్థ మివి తెలిపింది. 'మివి ఏఐ' పేరుతో దీన్ని అభివృద్ధి చేసినట్లు సంస్థ సహ వ్యవస్థాపకులు, సీఎంఓ మిధులా దేవభక్తుని శుక్రవారం ఇక్కడ వెల్లడించారు. ఏఐ పరిశోధన, అభివృద్ధిలో ఇదొక కీలక అడుగని ఆమె వివరించారు. అధునాతన ఎల్‌ఎల్‌ఎం (లాంగ్ లాంగ్వేజ్ మోడల్)తో దీన్ని ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. 'మివి ఏఐలో ఉపయోగించిన ఎన్‌ఎల్‌పీ (నాచురల్ లాంగ్వేజ్ ప్రాసెసింగ్) మనిషి భావోద్వేగాలను అర్థం చేసుకుంటుంది. సందర్భాన్ని బట్టి మన సంభాషణలను అనుకరిస్తుంది. వినియోగదారుల మాటలను అర్థం చేసుకుని, దానికి తగ్గట్లు సమాధానాలు ఇస్తుంది. ఎన్నో రకాల మాండలికాలతో దీన్ని తయారు చేశాం. ప్రత్యేకంగా 'హాయ్ మివి' అనే వేక్ వర్డ్‌ను రూపొందించాం. ప్రపంచంలో కొన్ని ప్రముఖ సంస్థలే వేక్ వర్డ్‌ను తీసుకొచ్చాయి' అని వివరించారు.




### ఈ పరికరాల్లో అందిస్తున్నాం

మివి ఏఐ సాంకేతికతను తమ ఇయర్‌బడ్స్, హోమ్ మానిటరింగ్ కెమేరాలు, స్మార్ట్ వేరబుల్స్, ఐఓటీ పరికరాల్లో అందిస్తున్నట్లు తెలిపారు. సంస్థలో 1,500 మందికి పైగా ఉద్యోగులున్నారని వెల్లడించారు. మివి ఏఐ కోసం 100 మంది ఇంజినీర్లు పనిచేశారని తెలిపారు. మివి ఏఐ ద్వారా వినియోగదారులకు వ్యక్తిగతీకరించిన కృత్రిమ మేధ అనుభవాన్ని అందించే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. భవిష్యత్తులో స్మార్ట్ హోమ్ పరికరాలు, వినియోగదారుల సేవా కేంద్రాలు, ఇతర ఏఐ ఆధారిత ఉత్పత్తులలో దీన్ని వినియోగించే అవకాశం ఉందని పేర్కొన్నారు. గత ఆర్థిక సం వత్సరంలో సంస్థ రూ.250 కోట్ల ఆదాయాన్ని ఆర్జించిందని, 2025-26లో రూ.300 కోట్ల లక్ష్యాన్ని విధించుకున్నట్లు మివి సహ వ్యవస్థాపకుడు, సీఈఓ విశ్వనాథ్ కందుల తెలిపారు.




Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com